ఆంధ్రజ్యోతి


ANDHRAJYOTHY

అన్నమయ్య

జిల్లా వార్తలు

5

మంగళవారం 28 జనవరి 2025



మదనపల్లె వ్యూ

పరిష్కార వారధిగా.. నేడే చర్చావేదిక

- మదనపల్లెలోని కదిరి రోడ్డు వీరబ్రహ్మేంద్రస్వామి ఫంక్షన్‌హాలులో...
- హాజరు కానున్న మున్సిపల్ కమిషనర్ ప్రమీల, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులు

మదనపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జనానికి అక్షరాయుధం ఆంధ్రజ్యోతి. ఏ సమస్య అయినా సరే చెప్పుకుంటే.. ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లకు, ప్రలోభాలకు లోనుకాకుండా ఆంధ్రజ్యోతి డేరింగ్ అండ్ డ్యాషింగ్‌గా వార్తలు ప్రచురిస్తూ వస్తోంది. ఇప్పటిదాకా ప్రజా సమస్యలను వెలికితీయడం, అవినీతిపై వార్తలు ప్రచురించడంతో పాటు రాజకీయాల్లో లొసుగులను ప్రజలకు తెలియజేస్తూ వచ్చింది. 22 సంవత్సరాలుగా ప్రజల పక్షాన ఆంధ్రజ్యోతి అలుపెరగని పోరాటం చేస్తోంది. 23వ సంవత్సరంలోకి అడుగుపెట్టిన ఆంధ్రజ్యోతి దినపత్రిక తమను ఆదరిస్తున్న జనం కోసం నడుం బిగించింది.

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని నిర్ణయించింది. అందులో భాగంగా 'అక్షరం అండగా.. పరిష్కారం అజెండాగా' కార్యక్రమానికి రూపకల్పన చేసింది. మదనపల్లెలోని ప్రశాంత్‌నగర్‌లో సమస్యల పరిష్కారానికి చర్చా కార్యక్రమం జరగనుంది. ఇందులో భాగంగా మంగళవారం మధ్యాహ్నం 2 గంటలకు పట్టణంలోని కదిరిరోడ్డు వీరబ్రహ్మేంద్రస్వామి ఫంక్షన్ హాలులో జరిగే చర్చా వేదికకు మున్సిపల్ కమిషనర్ ప్రమీల, జనసేన నేత శ్రీరామ రామాంజనేయులుతో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, మున్సిపల్ అధికారులు హాజరవుతున్నారు. వీధుల్లో చెత్త ఎత్తకున్నా.. మురుగు కాలువలు శుభ్రం చేయకపోయినా.. వీధి లైట్లు వెలగకపోయినా.. రోడ్లు సరిగా లేకున్నా.. ఇలాంటి సమస్యలను ప్రజలు నివేదించవచ్చు. ఆంధ్రజ్యోతి నిర్వహించే ఈ చర్చావేదిక కార్యక్రమానికి హాజరయ్యే ప్రజాప్రతినిధులు, అధికారులు ప్రజల సమస్యలు ఆలకించి పరిష్కరించేందుకు కృషి చేయనున్నారు. సమస్య పరిష్కారం అయ్యే వరకు ప్రజల పక్షాన ఆంధ్రజ్యోతి నిలబడుతుంది.

రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని మార్చేసిన యువగళం

- యువగళం పాదయాత్ర మొదలై రెండేళ్లు పూర్తి
- మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి రాంప్రసాద్‌రెడ్డి

రాయచోటిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ గత ఎన్నికలకు ముందు చేపట్టిన యువగళం పాదయాత్ర రాష్ట్ర రాజకీయ చిత్రపటాన్ని మార్చివేసిందని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. రాయచోటిలోని తమ క్యాంపు కార్యాలయంలో సోమవారం మంత్రి పాత్రికేయుల సమావేశంలో మాట్లాడుతూ నారా లోకేశ్ కుప్పం వరదరాజస్వామి పాదాల చెంత నుంచి 2023 జనవరి 27వ తేదీ పాదయాత్ర ద్వారా ప్రజల్లోకి వెళ్లి అన్ని వర్గాల ప్రజల సమస్యలను తెలుసుకున్నారన్నారు. రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజకవర్గాలు, 232 మండలాలు, మున్సిపాలిటీలు, 2,097 గ్రామాల మీదుగా 226 రోజుల పాటు 3132 కిలోమీటర్ల మేర యువగళం పాదయాత్ర సాగిందన్నారు. ఉమ్మడి చిత్తూరు జిల్లాలో యువనేత ప్రజారథం నుంచి నిలబడే స్టూల్ వరకు అన్నీ లాగేసి గొంతునొక్కే ప్రయత్నం చేశారన్నారు. అయినప్పటికీ వైసీపీ నాయకుల తాటాకు చప్పుళ్లకు భయపడకుండా కోట్లాది మంది ప్రజల గొంతుకనే తన గళంగా వినిపిస్తూ రెట్టింపు ఉత్సాహంతో ముందుకు సాగారన్నారు. పాదయాత్రలో యువత, మహిళలు, వృద్ధులు, విద్యార్థులు, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల ఆకాంక్షలకు అనుగుణంగా అనేక హామీలను ఇచ్చారన్నారు. ఆ హామీలన్నీ ఒక్కొక్కటి నెరవేరుస్తున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు గతంలో ప్రకటించిన సూపర్‌సిక్స్ పథకాలన్నీ ఒక్కొక్కటిగా తప్పక అమలు చేస్తామని తెలిపారు. త్వరలోనే మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తామని చెప్పారు. వైసీపీ ప్రభుత్వ హయాంలో జగన్‌రెడ్డి అడిగిన కమీషన్లకు భయపడి రాష్ట్రం వదిలి పారిపోయిన కంపెనీలన్నీ నేడు ముఖ్యమంత్రి చంద్రబాబు విజన్‌పై నమ్మకంతో తిరిగి మన రాష్ట్రంలో వివిధ పరిశ్రమలు నెలకొల్పేందుకు పారిశ్రామిక వేత్తలు మన రాష్ట్రానికి క్యూ కడుతున్నారన్నారు. దావోస్ పర్యటన అనంతరం ప్రముఖ ప్రపంచ దిగ్గజ కంపెనీలన్నీ రాష్ట్రంలో పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. వైసీపీ నేతలు ప్రభుత్వంపై తప్పుడు ప్రచారాలు మానుకుని రాష్ట్ర అభివృద్ధికి సహకరించాలని ఆయన హితవు పలికారు. సమావేశంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, రాజంపేట పార్లమెంట్ మైనార్టీ కార్యదర్శి వతన్‌నిస్సార్, రాజంపేట పార్లమెంట్ టీడీపీ ఉపాధ్యక్షుడు గుర్రం సుబ్బయ్యనాయుడు, నూలివీడు టీడీపీ నేత వెంకటశివారెడ్డి, మహిళా నేత సుజాత, ముస్లిం హక్కుల పోరాట సమితి నేత సగీర్, చెంగా ఈశ్వరయ్య, మైనుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

అప్పన్నకుంట ఆక్రమణ

- మొరవను వదల్లేదు...
- ప్లాట్లు వేసి యథేచ్ఛగా విక్రయాలు
- సుమారు 10 ఎకరాల్లో ఆక్రమణలు
- కుంటకు పొంచి ఉన్న ప్రమాదం

సుండుపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లెకు ఎంతో కీలకమైన అప్పన్నకుంట ఆక్రమణకు గురవుతోంది. గత వైసీపీ ప్రభుత్వం కొందరు ఆ పార్టీ నాయకులు కుంటతో పాటు మొరవను కూడా ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. అప్పన్నకుంటకు సమీపంలో ఓ జూనియర్ కళాశాల, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు ఉన్నాయి. కుంట దిగువభాగంలో కుంటకు ఇరువైపులా చాలామంది ఇళ్లు నిర్మించుకుని జీవనం సాగిస్తున్నారు. 30 సంవత్సరాల క్రితం అప్పన్నకుంట వందల ఎకరాల సాగు భూమికి సాగునీటిని సరఫరా చేసేది. అప్పన్నకుంటలో వరద నీరు నిలువ ఉంటే దిగువన ఉండే సుండుపల్లె మండల కేంద్రంలో తాగునీటి సమస్య ఉండదు. అలాంటి అప్పన్నకుంటకు ప్రమాదం పొంచి ఉంది. పదేళ్ల నుంచి అప్పన్నకుంటలో ఆక్రమణలు విరివిగా జరిగాయి. సర్వే నెంబరు 2169లో 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న అప్పన్నకుంటను భూబకాసురులు కొంచెం కొంచెంగా ఆక్రమిస్తున్నారు. మండల కేంద్రంలో ఇంటి స్థలాలకు విపరీతమైన డిమాండ్ ఉండడంతో గత వైసీపీ ప్రభుత్వంలో వైసీపీ నాయకులు కుంట, కుంట స్థలాలను ఆక్రమించి ఇంటి నిర్మాణాలు చేశారు. అంతేగాకుండా కుంట దక్షిణ దిక్కున ఉన్న మొరవను సైతం ఆక్రమించారు. బీజేపీ నాయకులు కుంట ఆక్రమణలపై ఫిర్యాదు చేయడంతో సుమారు 10 ఎకరాలు ఆక్రమణలో ఉన్నట్లు అధికారులు సర్వే చేసి గుర్తించారు. ఆక్రమణల్లో ఉన్నట్లు ఫిర్యాదుదారులకు తెలిపారు. కానీ వాటిపై ఎటువంటి చర్యలు తీసుకోలేదు. అప్పన్నకుంటను ఆక్రమణల నుంచి కాపాడి రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.



కుంట ఉత్తర భాగాన మట్టి కట్టను తవ్వి నిర్మించిన అక్రమ నిర్మాణం



ఆక్రమణకు గురైన అప్పన్నకుంట

కుంట కట్ట ఆక్రమించి నిర్మాణాలు

నీటి ఎద్దడిని తట్టుకునేలా అప్పన్నకుంట చుట్టూ గతంలో మట్టికట్టను నిర్మించారు. అయితే ఆక్రమణదారులు ఆ మట్టికట్టను తొలగించి అక్రమ నిర్మాణాలు చేపట్టారు. ఉత్తరాన సుమారు 10 మీటర్లు కట్ట లోపల తవ్వి నిర్మాణాలు చేపట్టారు. ఎంపీడీవో కార్యాలయం ఇరుపక్కల అక్రమ నిర్మాణాలకు కొదవే లేదు. రానురాను మట్టి కట్టను తవ్వి నిర్మాణాలు చేసుకుంటూ పోతుండడంతో అప్పన్నకుంట విస్తీర్ణం కర్పూరంలా కరిగిపోతోంది. ఆక్రమణలపై ఫిర్యాదు చేసినా కూడా రెవెన్యూ అధికారులు, ఇరిగేషన్ అధికారులు పట్టించుకోలేదని స్థానికులు చెబుతున్నారు.

కుంట తెగి 2012లో ఆస్తినష్టం

2012 సంవత్సరంలో వచ్చిన తుఫాన్ కారణంగా అప్పన్నకుంట తెగి పెద్ద మొత్తంలో ఆస్తినష్టం జరిగింది. అప్పన్నకుంట పైభాగం నుంచి వర్షపు నీరు వచ్చి కుంటలోకి చేరుతుంది. కుంట, మొరవ ఆక్రమణలకు గురికావడం వలన సుండుపల్లెకు ప్రమాదం పొంచి ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దక్షిణం వైపున మొరవ పూర్తిగా ఆక్రమించారు. పడమర వైపున కూడా స్థానికులు ఆక్రమించి తమ ఆధీనంలో పెట్టుకున్నట్లు తెలుస్తోంది. కుంట నిండితే నీరు ఇళ్లలోకి వచ్చే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు. కుంటకు ఉత్తరాన మొరవ కూడా ఆక్రమణలకు గురవుతోంది. 2012 సంవత్సరంలో కుంట తెగడం వలన సగం సుండుపల్లెలోని ఇళ్లల్లోకి వర్షపు నీరు చేరడంతో పెద్ద మొత్తంలో ఆస్తినష్టం జరిగింది. ఆక్రమణల నుంచి కుంటకు రక్షణ కల్పించాలని ప్రజలు కోరుతున్నారు.

కెనాల్ తవ్విస్తాము

- నాగేంద్రనాయక్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, సుండుపల్లె

అప్పన్నకుంట చుట్టూ ఆక్రమణలు ఉన్నాయి. రెవెన్యూ అధికారులు సర్వే చేశారు. దక్షిణ భాగాన మొరవ పూర్తిగా ఆక్రమించి ఉన్నారు. కెనాల్ తవ్వించి అప్పన్నకుంట అభివృద్ధికి బాటలు వేస్తాము. దక్షిణ భాగాన పూడికతీత పనులు చేయిస్తాము. కుంట చుట్టూ ఆక్రమణలు ఉన్నట్లు సర్వేలో తేలింది. పై అధికారులకు సమాచారం ఇచ్చి చర్యలు తీసుకుంటాము.

మొరవపై అక్రమ నిర్మాణాలు

వర్షాలు సమృద్ధిగా పడి పైప్రాంతాల నుంచి చెరువులు, కుంటలు నిండి నీరు వస్తే అప్పన్నకుంట సుండుపల్లెకు రక్షణగా ఉంది. ఆ అప్పన్నకుంటకు రెండు మొరవలను ఏర్పాటు చేసి కుంట నిండిన తర్వాత వర్షపు నీరు ఆ మొరవల ద్వారా బాహుదా నదిలోకి కలిసేలా దశాబ్దాల క్రితం ఏర్పాటు చేశారు. అయితే ఉత్తరాన ఏర్పాటు చేసిన మొరవను కొందరు ఆక్రమించారు. వైసీపీ పాలనలో అప్పటి ప్రభుత్వంలో రింగ్‌లీడర్‌గా వ్యవహరించిన ఓ వ్యక్తి స్థానికంగా పట్టా భూమి కలిగిన ఓ వ్యక్తి నుంచి భూమిని కొనుగోలు చేసి ఆ పట్టా భూమితో పాటు మొరవను ఆక్రమించినట్లు ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంలో కూడా ఆయన కీలకనేతగా నియోజకవర్గంలో వ్యవహరిస్తున్నారు. స్థానికులు సైతం మొరవను ఆక్రమించడంతో పూర్తిగా మొరవనేదే లేకుండా చేశారు. మొరవ ఆక్రమణలతో కుంటతో పాటు సుండుపల్లె మండల కేంద్రానికి ప్రమాదం పొంచి ఉంది. పక్క పట్టా భూమి నెంబరు వేసి కుంట స్థలాలను, మొరవను రిజిస్ట్రేషన్లు చేసి అమ్మేస్తున్నారని విమర్శలు వస్తున్నాయి. స్థానిక ఓ ఫంక్షన్ హాలు నిర్వాహకుడు మొరవపై పునాది నిర్మించారు. గత ప్రభుత్వంలో ఎలాగూ పట్టించుకోలేదు... కూటమి ప్రభుత్వంలో కూడా కనీసం అధికారులు అటువైపు కన్నెత్తి చూడకపోవడం చూస్తుంటే అప్పన్నకుంట పూర్తిగా ఆక్రమణలకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానికులు వాపోతున్నారు.



మొరవపై నిర్మించిన అక్రమ నిర్మాణం

భారత షూటింగ్ బాల్ జట్టుకు మహమ్మద్ యూసఫ్ ఎంపిక 7



ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద ఘర్షణ 7

- ఉద్రిక్తత... భారీగా పోలీసుల మోహరింపు
- ఇరువర్గాలు ఎన్డీయేకి చెందినవారే...

తలస్నానం చేస్తే రూ.వంద

- 'కస్తూర్బా'లో విద్యార్థినులకు నరకం
- కాళ్లు నొక్కించుకుని... పాత్రలు కడిగించుకుని...
- ప్రశ్నిస్తే మార్కులు తగ్గించి వేధిస్తారు...
- రాత్రి వేళల్లో సరుకులు తరలింపు
- సామాజిక తనిఖీలో బయటపడ్డ విస్తుపోయే నిజాలు

ములకలచెరువు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తలస్నానం చేస్తే రూ.100 ఇవ్వాలి... కాళ్లు నొక్కించుకుంటారు.... పాత్రలు కడిగించుకుని చెత్త ఊడిపిస్తారు.. అన్నంలో పురుగులు వస్తున్నాయని అడిగితే బూతులు తిడతారు... కూరలు బాగా లేవని ప్రశ్నిస్తే మార్కులు తగ్గిస్తారు... వేడినీళ్ల కోసం ఒక్కో విద్యార్థిని నుంచి రూ.500 వసూలు... రాత్రివేళల్లో సరుకులు తరలింపు... విద్యార్థినుల హాజరుకు మించి రిజిస్టర్‌లో నమోదు... ఇలా పాఠశాల సిబ్బంది ద్వారా విద్యార్థినులు నరకం అనుభవిస్తున్నారు. ములకలచెరువు కస్తూర్బాగాంధీ బాలికల గురుకుల విద్యాలయంలో విద్యార్థినుల పడుతున్న ఇబ్బందులన్నీ సామాజిక తనిఖీలో బయటపడ్డాయి. ఈ వివరాలను సామాజిక తనిఖీ బృందం తల్లిదండ్రుల సమావేశంలో వెల్లడించింది. కూటమి ప్రభుత్వం వచ్చాక తొలిసారిగా ప్రభుత్వ పాఠశాలలు, గురుకుల పాఠశాలలు, సంక్షేమ వసతి గృహాల్లో సామాజిక తనిఖీ నిర్వహిస్తోంది. జిల్లాలోని 68 ప్రభుత్వ పాఠశాలల్లో సామాజిక తనిఖీ (సోషల్ ఆడిట్) చేపట్టారు. ఇందులో భాగంగా ములకలచెరువు కస్తూర్బాగాంధీ బాలికల గురకుల విద్యాలయంలో మూడు రోజుల పాటు సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ క్రమంలో సోమవారం పాఠశాలలో జరిగిన విద్యార్థినులు, తల్లిదండ్రుల సమావేశంలో సామాజిక తనిఖీ వివరాలను స్టేట్‌రిసోర్స్ పర్సన్ సుబ్బారావు సమక్షంలో జిల్లా రిసోర్స్ పర్సన్లు మల్లేష్, భగవాన్, నాగిరెడ్డి, సరిత వెల్లడించారు. 6వ తరగతి విద్యార్థినులను తెల్లవారుజామున 4 గంటలకే నిద్రలేపి చపాతిలు చేయిస్తున్నారని, విద్యార్థినులు అనారోగ్యానికి గురైతే కాలం చెల్లిన మందులు ఇస్తున్నారని, విద్యార్థినులకు ఇంజక్షన్ వేస్తే ఒకరిద్దరికి సూది లోపలే ఉండిపోయి ఇన్‌ఫెక్షన్ అయ్యిందని, హాజరు ఎక్కువగా వేసి సరుకులు, కోడిగుడ్లను రాత్రివేళల్లో అక్రమంగా తరలిస్తున్నారని వెల్లడించారు. ఎవరైనా తలస్నానం చేస్తే వారి వద్ద నుంచి రూ.100 వసూలు చేస్తున్నారని, 22 మంది విద్యార్థినుల దగ్గర నుంచి పరీక్ష ఫీజు పేరుతో రూ.1500 వసూలు చేశారని, పురుగుల అన్నం, అల్పాహారం చాలీచాలనంతగా పెడుతున్నారని, భోజనం బాగాలేదని చెబితే వేధిస్తున్నారని, ప్రతి ఆదివారం రెండు చికెన్ ముక్కలు మాత్రమే పెడున్నారని విద్యార్థినులు తమ దృష్టికి తెచ్చారని తెలిపారు. పాఠశాలలో జరుగుతున్న అక్రమాలు, అన్యాయం, భోజనం బాగాలేదని ప్రశ్నిస్తే ప్రాక్టికల్స్ సమయంలో మార్కులు తగ్గిస్తామని బెదిరిస్తున్నట్లు వెల్లడైందని వెల్లడించారు. అలాగే పాఠశాలలో నాలుగు సీసీ కెమెరాలు మాత్రమే పనిచేస్తున్నాయని, ముఖ్యంగా స్టోర్‌రూంలో కెమెరాలు పనిచేయడం లేదని తెలియజేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థినుల తల్లిదండ్రులు మాట్లాడుతూ సామాజిక తనిఖీలో వెల్లడైన విషయాలు అన్నీ నిజమేనని చెప్పారు. ఈ విషయాలను ఇక్కడ చదువుతున్న తమ బిడ్డలు మా దృష్టికి తెచ్చారన్నారు. గతంలో జరిగిన తల్లిదండ్రుల సమావేశాల్లో ప్రశ్నించినా తీరు మారలేదన్నారు. సమావేశంలో ఎంఈవో వెంకటరమణ పాల్గొన్నారు.



తల్లిదండ్రుల సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సామాజిక తనిఖీ బృందం

విద్యార్థులను వేధిస్తే చర్యలకు సిఫార్సు

- సుబ్బారావు, స్టేట్ రిసోర్స్ పర్సన్, జిల్లా ఇన్‌చార్జి



సామాజిక తనిఖీ బృందానికి విషయాలు చెప్పారని విద్యార్థినులను వేధిస్తే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం. ఎవరినైనా వేధించిన, తిట్టినా టోల్ ఫ్రీ నెంబర్ 14417కు లేదా తన నెంబర్ 9705785940కు సమాచారం అందించాలి. సామాజిక తనిఖీలో బయటపడ్డ వివరాలను స్టేట్ ప్రాజెక్ట్ డైరెక్టర్, కలెక్టర్‌కు అందజేస్తాం.

కల్లుగీత కులాల మద్యం షాపులకు నోటిఫికేషన్ జారీ

- ఫిబ్రవరి 5లోగా దరఖాస్తు చేసుకోవాలి
- 6న పరిశీలన, 7న డ్రా
- కలెక్టర్ చామకూరి శ్రీధర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ శ్రీధర్, చిత్రంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ మధుసూదన్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు జిల్లాకు కేటాయించబడిన కల్లుగీత కులాలకు చెందిన మద్యం షాపులకు సోమవారం నోటిఫికేషన్ జారీ చేశామని కలెక్టర్ చామకూరి శ్రీధర్ తెలిపారు. సోమవారం రాయచోటి కలెక్టరేట్‌లో నోటిఫికేషన్ జారీ చేసిన అనంతరం పాత్రికేయులతో కలెక్టర్ మాట్లాడారు. కల్లుగీత కులాలకు సంబంధించి జిల్లాకు 11 మద్యం షాపులు కేటాయించారని, ఈ షాపులకు సంబంధించి ఈనెల 24న పారదర్శకంగా లాటరీ పద్ధతిలో కల్లుగీత ఉపకులాలకు షాపుల కేటాయింపుపై డ్రా తీశామని తెలిపారు. ఇందులో రాయచోటి మున్సిపాలిటీ గౌడ్ సంఘానికి, రాజంపేట, మదనపల్లె మున్సిపాలిటీలు, రామసముద్రం, వీరబల్లి, నిమ్మనపల్లి, తంబళ్లపల్లి, కలకడలకు ఈడిగ, బి.కొత్తకోట రూరల్ గౌడ్, నందలూరు గౌడ, పీలేరు గౌండ్ల సంఘానికి కేటాయించినట్లు తెలిపారు. అర్హులైన వారు ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల్లోగా రిజిస్ట్రేషన్ ఫీజు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన మేరకు రూ.2 లక్షలు నాన్ రీఫండబుల్ మొత్తాన్ని చెల్లించాల్సి ఉంటుందన్నారు. మున్సిపాలిటీ ప్రాంతాలకు రూ.21,66,667, మండల ప్రాంతానికి రూ.18,33,334 కట్టాల్సి ఉంటుందన్నారు. ఫిబ్రవరి 6న పరిశీలన చేస్తారని, 7వ తేదీ ఉదయం 10 గంటలకు షాపులకు డ్రా తీస్తామన్నారు. కల్లుగీత ఉపకులాలకు సంబంధించి కుల ధృవీకరణ పత్రం ఇవ్వాల్సి ఉంటుందని, అర్హులు ఎవరైనా దరఖాస్తు చేసుకున్న 24 గంటల్లోగా ఉపకులం స్పష్టంగా పేర్కొంటూ సప్లిమెంటరీ కుల ధృవీకరణ పత్రం జారీ చేయాలని తహసీల్దార్లందరికీ స్పష్టమైన ఆదేశాలు జారీ చేశామని తెలిపారు. మద్యం షాపులకు సంబంధించి ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని, అలాగే రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, రాజంపేట, కోడూరు, మదనపల్లె, ములకలచెరువు, వాయల్పాడు, పీలేరులోని ఎక్సైజ్ శాఖ కార్యాలయాల్లో నేరుగా దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అర్హులైన వారందరూ దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సూపరింటెండెంట్ జి.మధుసూదన్, సహాయ సూపరింటెండెంట్ వై.జోగేంద్ర, ఇన్‌స్పెక్టర్ మల్లయ్య పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు బోల్తా.. 11 మందికి గాయాలు



గుడిపాడు వద్ద బోల్తాపడిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

దువ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు సమీపంలో హైదరాబాదు నుంచి చిత్తూరుకు వెళుతున్న జగన్ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు సోమవారం తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 11 మందికి స్వల్ప గాయాలైనట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. గాయపడిన వారిలో చిత్తూరులోని ఒకే కుటుంబానికి చెందిన 10 మంది ఉన్నారన్నారు. వీరిని ప్రాథమిక చికిత్స నిమిత్తం మైదుకూరుకు.. అనంతరం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వరుస చోరీలతో భయం భయం

- **సన్నపల్లెలో ఇంట్లో దొంగతనం**
- **13 తులాల బంగారు, రూ.1.5 లక్షల నగదు అపహరణ**


సన్నపల్లెలో చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న సీఐ

ఖాజీపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుసదొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకుగురవుతున్నారు. ఆదివారం భూమాయపల్లెవద్దగల భీమలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీకి పాల్పడగా.. సోమవారం తెల్లవారుజామున సన్నపల్లె గ్రామానికి చెందిన తుమ్మలూరు రవీంద్రారెడ్డి ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డారు. రవీంద్రారెడ్డి మిద్దెపైన నిద్రిస్తుండగా కింద ఇంటి తలుపుల తాళాలు తొల గించి లోనికి ప్రవేశించి బీరువాలోని 13 తులాల బంగారు,రూ.1.50లక్షలు నగదు చోరీ చేశారు. ఉదయం యజమాని కిందకు వచ్చి దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు సీఐ సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్‌టీంను పిలిపించి నమూనాలను సేకరించి దొంగలకోసం గాలింపు చేపడుతున్నామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

80 మద్యం సీసాలు స్వాధీనం


వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్

కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకులోని ఫక్కీరుపల్లెలో దాడులు నిర్వహించి ఇరువురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ తెలిపారు. చిన్నచౌకులోని ఎక్సైజ్ పోలీసుస్టేషనులో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కడపకు చెందిన శివయ్య, బొల్లు బాలక్రిష్ణలు మిలిటరీకి చెందిన 80 (750 ఎంఎల్) మద్యం సీసాలను ఇరువురు ద్విచక్ర వాహనంలో తీసుకెళుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. మద్యంబాటళ్లు, బైకు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండుకు తరలించినట్లు తెలిపారు. మద్యం, బైకు విలువ రూ.2.65 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది నరసిరహారావు, చంద్రశేఖర్, గురు ప్రసాద్‌లు పాల్గొన్నారు. పట్టుబడిన మద్యంసీసాలు మిలిటరీకి చెందిన పేర్లున్నప్పటికీ అందులో నకిలీవిగా ఉన్నట్లుగా గుర్తించి క్వాలిటీ టెస్టు కోసం పంపినట్లు సీఐ తెలిపారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం దొరల గోరీల వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. నగరంలోని దండో రా కాలనీకి చెందిన జూటూరు దస్తగిరి దొరల గోరీల వద్ద బెల్టుషాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం బాటిళ్లు అమ్మేవాడు. ఈ సమాచారం రావడంతో ఎస్ఐ హుసేన్ సిబ్బందితో కలిసి దాడి చేసి దస్తగిరిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 19 క్వార్టర్ బాటళ్లు స్వాధీనం చేసుకుని.. నిందితున్ని రిమాండుకు తరలించామని తెలిపారు.

బావపై బామ్మర్ది దాడి



కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అశోక్‌నగర్‌లో సోమవారం ఉదయం బావపై బామ్మర్ది దాడి చేశా డు. ఈ దాడిలో బావ తలకు గాయమైం ది. అశోక్‌నగర్‌కు చెందిన దివాకర్ అతని బావమరిది దినకర్‌ల మధ్య మనస్పర్థలు ఉండేవి. ఈ నేపథ్యంలో ఇరువురి మధ్య మాటమాట పెరగడంతో దివాకర్‌పై దినకర్ రాయితో దాడి చేయగా తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. బాధితుడు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్


అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయ భూములపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- **63 ఎకరాల కౌలు విషయం తేల్చాలని వినతి**
- **స్పందించిన కలెక్టర్.. న్యాయం చేస్తామని హామీ**


కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న కలమల్ల వాసులు

ఎర్రగుంట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాత కలమల్లలోని సిద్ధేశ్వర స్వామి ఆలయానికి చెందిన మాన్యం భూముల కౌలు చెల్లింపు, అన్యాక్రాంతంపై ఆలయ అభివృద్ధి కమిటీ, సర్పంచి, ఉపసర్పంచులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలమల్ల గ్రామానికి చెందిన సుమారు 200 మంది గ్రామస్తులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. 2011 నుంచి నేటి వరకు కొత్త కలమల్ల ఆలయ కమిటీకి కౌలును కేటాయిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న దేవదాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వివరాల్లోకి వెళితే.. పాత కలమల్ల గ్రామంలో సిద్ధేశ్వరస్వామి ఆలయానికి 60 ఎకరాలు మాన్యం కింద కేటాయించారు. కాగా, అదే గ్రామంలో సర్వే నెంబరు 399/1లో ఒక రైతు పొలంలో శివాలయం నిర్మించారు. దీన్ని సిద్ధేశ్వరస్వామి ఆలయంగా పరిగణించి.. దేవదాయ అధికారులు 2011 నుంచి నేటి వరకు పాత సిద్ధేశ్వరస్వామి మాన్యం భూములను కౌలుకు కేటాయిస్తున్నారు. దీంతో గ్రామంలోని ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయి.. వారి మధ్య వైషమ్యాలు తారాస్థాయికి చేరాయి. ఈ విషయంపై పాత కలమల్లలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీకి చెందిన మాజీ సర్పంచి వి.క్రిష్ణయ్య, పి.శ్రీను, పి.సూర్యుడు, నారాయణ, గిరి, పి.శ్రీనివాసులు, శంకరయ్య, రామాంజనేయులు, ధనుంజయరెడ్డి, సాంబశివారెడ్డి, సర్పంచి సి.హెప్సీబా, ఉప సర్పంచి పంజగల విజయలక్ష్మి, గ్రామ ప్రజలు సోమవారం కలెక్టర్ చెకుకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తిగా విచారించి న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఎండోమెంట్, రెవెన్యూ, కలెక్టర్ కార్యాలయ అధికారులతో కమిటీ వేసి సున్నితమైన ఈ అంశాన్ని వెంటనే పరిష్కరించాలని దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్‌ను ఆదేశించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి 15 రోజులలోపు నివేదికను తనకు సమర్పించాలని ఆదేశించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

బాలయ్యకు పద్మభూషణ్ అవార్డు ఆనందకరం

- **బాలకృష్ణ అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు పీరయ్య**


దుస్తులు అందజేస్తున్న పీరయ్య

కడప మారుతీనగర్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సినీ, రాజకీయ రంగాలో రాణిస్తూ.. సామాజికంగా సేవలందిస్తున్న నందమూరి బాలకృష్ణకు పద్మభూషణ్ అవార్డు దక్కడం ఆనందకరమని జిల్లా బాలకృష్ణ అభిమాన సంఘం అధ్యక్షుడు పి.పీరయ్య అన్నారు. బాలయ్య సేవలను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం పద్మభూషణ్ పురస్కారానికి ఎంపిక చేయడం.. బాలయ్య నటించిన అఖండ, వీర సింహారెడ్డి, భగవంత్ కేసరి, ఢాకూ మహారాజ్ సినిమాలు కడప సినీ చరిత్రలో కోటి రూపాయలకు పైగా వసూళ్ళు సాధించి సరికొత్త రికార్డు సృష్టించాయి. ఈ సందర్భాన్ని పురస్కరించుకొని పీరయ్య ఆధ్వర్యంలో సోమవారం సాయంత్రం అప్సరా థియేటర్‌వద్ద అభిమానుల సమక్షంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. అనంతరం అప్సరా థియేటర్ సిబ్బదికి దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సినీ, రాజకీయ, సేవారంగాలలో సేవలందించడంలో బాలయ్య ముందు వరసలో వుంటారన్నారు. ఆ అవార్డులు ఎప్పుడో రావాల్సి వుందన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం గుర్తించి బాలయ్యకు పద్మపురస్కారానికి ఎంపిక చేయడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో పలువురు బాలయ్య అభిమానులు పాల్గొన్నారు.

'జ్యోతి'లో కూల్చివేతలను అడ్డుకున్న భక్తులు


కాశినాయన క్షేత్రంలో కూల్చివేతలను అడ్డుకుంటున్న భక్తులు

కాశినాయన, జనవరి 28 (ఆంధ్రజ్యోతి): కాశినాయన జ్యోతిక్షేత్రంలో ఫారెస్ట్ అనుమతులు లేకుండా భవనాలు నిర్మించారంటూ సోమవారం ఫారెస్ట్ అధికారులు ఎక్స్‌కవేటర్‌తో కూల్చివేతకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న చుట్టుపక్కల గ్రామాలకు చెందిన కాశినాయన భక్తులు పెద్దఎత్తున జ్యోతిక్షేత్రానికి చేరుకొని నిర్మాణాల కూల్చివేతలను అడ్డుకున్నారు. ఈసందర్భంగా పలువురు భక్తులు మాట్లాడుతూ కాశినాయన ఆలయ నిర్మాణానికి సంబంధించిన అనుమతుల కోసం ఆలయ నిర్వాహకులు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పెద్దలతో చర్చలు జరుపుతున్నారన్నారు. ఇందుకు సంబంధించిన ఫైల్ కేంద్ర ప్రభుత్వంలోని అటవీశాఖ మంత్రి వద్దకు చేరిందన్నారు. కొంత సమయం ఇస్తే అనుమతులు తెచ్చుకుంటామంటూ ఫారెస్ట్ అధికారులను కోరారు. దీంతో ఫారెస్ట్ అధికారులు వెనుదిరిగి వెళ్లారు.

పంజాబ్ విజయ లక్ష్యం... 140 పరుగులు

కడప స్పోర్ట్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా-పంజాబ్ జట్ల మధ్య జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా మూడవ రోజైన సోమవారం ఆట ముగిసే సమయానికి పంజాబ్ జట్టు విజయానికి మరో 140 పరుగుల దూరంలో నిలిచింది. వివరాలిలా.....తొలుత ఈనెల 25న బ్యాగింగ్ చేసిన ఆంధ్రా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు 45.1 ఓవర్లలో 119 పరుగులకు ఆలైట్ అయింది. దీంతో రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్రాజట్టు 62.1 ఓవర్లలో 162 పరుగులకు చేతులెత్తేసింది. ఇందులో ప్రసాద్ 68 పరుగులు చేశారు. దీంతో పంజాబ్ జట్టుకు విజయలక్ష్యంగా 255 పరుగులు నిర్దేశించింది. విజయమే లక్ష్యంగా బరిలోకి దిగిన పంజాబ్ జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 115 పరుగులు చేసింది. జస్కారన్‌వీర్ సింగ్‌పాల్ 56 పరుగులతో, ఉదయ్ సాహరన్ 57 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. కాగా విజయానికి చివరి రోజైన మంగళవారం మరో 140 పరుగుల దూరంలో వుంది.

సుండుపల్లె రెసిడెన్షియల్ స్కూల్‌కు అదనపు నిధులు మంజూరు

కలికిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లెలోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని బాలుర రెసిడెన్షియల్ పాఠశాలగా మార్చేందుకు అదనంగా మరో రూ.8.10 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ పాఠశాల నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టరు 3.9 శాతం ఎక్కువగా టెండర్ వేసినందువల్ల అంచనా వ్యయం పెరిగింది. అంతేగాకుండా కొత్త మరుగుదొడ్ల బ్లాక్‌కు సెప్టిక్ ట్యాంకు నిర్మించినందుకు కూడా అదనపు నిధులు అవసరమయ్యాయి.

117 జీఓ ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు అసంబద్ధం

కడప ఎడ్యుకేషన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాల మూసివేత, ఉపాధ్యాయుల సంఖ్య కుదింపు లక్ష్యంగా జీఓ నెంబర్ 117కు ప్రత్యామ్నయ మార్గదర్శకాలు ఈ ప్రభుత్వం విడుదల చేసినట్లుగా ఉందని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి లక్ష్మీరాజా, జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్‌బాబు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం కడప యూటీఎఫ్ భవన్‌లో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రాథమిక విద్యకు పాతర వేస్తూ తీసుకువచ్చిన జీఓ నెంబర్ 117 రద్దు చేయాలని ఉపాధ్యాయ సంఘాలు, ఎమ్మెల్సీలు, మేధావులు చేసిన పోరాటాల ఫలితంగా అప్పుడు ప్రతిపక్షంలో ఉన్న నేటి విద్యాశాఖ మంత్రి గతంలో పాదయాత్ర చేస్తూ 117 రద్దు చేస్తామని తెలిపారన్నారు. అయితే అధికారం చేపట్టిన తర్వాత 117కు ప్రత్యామ్నాయ మార్గదర్శకాలు విడుదల చేయడం జరిగిందని తెలిపారు. ప్రస్తుత మార్గదర్శకాలలు ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించే విధంగా కాక మరింత అధఃపాతాళానికి నెట్టివేసే విధంగా ఉన్నాయని ఆరోపించారు. జిల్లా ట్రెజరర్ కె.నరసింహరావు, జిల్లా కార్యదర్శులు సివి రమణ, ఎస్.ఏజాస్ అహ్మద్, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

భారత్ షూటింగ్ బాల్ జట్టుకు మహమ్మద్ యూసఫ్ ఎంపిక



మదనపల్లె అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు జరగనున్న ఏషియన్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే భారత జట్టులోకి మదనపల్లె పట్టణానికి చెందిన సీనియర్ షూటింగ్‌బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసఫ్‌బాష ఎంపికైనట్లు షూటింగ్‌బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు అందాయి. ఈనెల 30వ తేదీ ఢిల్లీలో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటారు. భారత్ జట్టుకు ఎంపికైన క్రీడాకారునికి ఏపీ షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పరుశురాముడు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దక్షిణ భారతదేశం నుంచి మదనపల్లెకు చెందిన యూసఫ్‌బాష ఎంపిక కావడం మదనపల్లెకే గర్వకారణమని జిల్లా కార్యదర్శి గౌతమి, నరేశ్ తెలిపారు. యూసఫ్ బాష అంతర్జాతీయ పోటీల్లో రాణించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని కోచ్, అన్నమయ్య షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనివాస్, సాగర్, కోశాధికారి సాయిశేఖరెడ్డి, సభ్యులు నాగేంద్రప్రసాద్, పవన్, సురేష్, సయ్యద్‌భాష, భారతి, మురళీ, క్రీడాభారతి అధ్యక్షులు దిలీప్‌కుమార్, విజయ్‌కుమార్, కరాటే సురేష్, క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్‌బాష , సీనియర్ క్రీడాకారులు మురళీ, ఉదయ్, శ్రీకుమార్, అభినందించారు.

అంతర్ జిల్లా బదిలీతో కడపకు కొత్త పంచాయతీ కార్యదర్శి

కలికిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రకాశం జిల్లా కంభం మండలంలోని ఎర్రబాలెం పంచాయతీ కార్యదర్శిగా పనిచేస్తున్న చల్లా స్వప్నను కడప జిలాకు బదిలీ చేస్తూ ప్రభుత్వం సోమవారం ఆదేశాలు జారీ చేసింది. భార్యాభర్తల కేటగిరీ కింద బదిలీ కోసం ఆమె చేసిన దరఖాస్తును ప్రభుత్వం పరిశీలించిన అనంతరం బదిలీలపై ఉన్న నిషేధాన్ని సడలిస్తూ ఉత్తర్వులిచ్చింది. ఆ మేరకు స్వప్నకు నియామక ఉత్తర్వులిచ్చేందుకు పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్‌ను ప్రభుత్వం అనుమతించింది. ఆశాఖ ముఖ్య కార్యదర్శి శశిభూషణ్ కుమార్ సోమవారం ఈ ఉత్తర్వులు విడుదల చేశారు.

ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద ఘర్షణ

- **భారీగా పోలీసుల మోహరింపు**
- **ఇరువర్గాలు ఎన్డీయేకి చెందినవారే...**
- **30మందిపై కేసు నమోదు..?**

ఎర్రగుంట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద లోడింగ్‌లో ఆధిపత్య పోరు సాగుతోంది. ఈ నేపథ్యంలో సోమవారం ఎన్డీయేకి చెందిన ఒక వర్గం వారు మరో వర్గంవారిపై దాడి చేశారు. ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద కలమల్లకు చెందిన సంజీవరెడ్డి, అతని అల్లుడు నారాయణరెడ్డి, సోదరుడు విద్యాసాగర్‌రెడ్డిలు కొన్ని సంవత్సరాలుగా ప్రొక్లైన్ పెట్టుకుని లోడింగ్ చేస్తు న్నారు. అయితే ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత కొండాపురం మండలంలోని చౌటపల్లె (పోట్లదుర్తి ఆర్ అండ్ఆర్ సెంటర్‌లో నివాసం ఉంటున్న)కు చెందిన వెల్లాల రామ్మోహన్‌రెడ్డి కూడా ప్రొక్లైన్ పెట్టి లోడింగ్ చేస్తున్నాడు. అయితే ఇటీవల సంజీవరెడ్డి అల్లుడు నారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి మధ్య లోడింగ్ విషయంలో వాగ్వాదాల జరిగాయి. ఈ నేపథ్యంలో ఆదివారం కూడా ఘర్షణ జరిగినట్లు సమాచారం. అయితే సోమవారం మాట్లాడుకుందాం రా అంటూ సంజీవరెడ్డి ఫోన్‌లో రామ్మోహన్‌రెడ్డిని పిలిచారు. దీంతో సుమారు 50మందితో వచ్చిన రామ్మోహన్‌రెడ్డి సంజీవరెడ్డిపై కట్టెలతో దాడి చేశారు. అలాగే యాష్‌పాండ్ వద్ద నున్న సంజీవరెడ్డి అల్లుడు మరికొందరిపై దాడి చేసి గాయపరిచారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు కొండాపురం, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు సీఐలు, ఎస్ఐలు పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. దాడులకు పాల్పడ్డ వెల్లాల రామ్మోహన్‌రెడ్డి, మరొ కొందరిపై, సంజీవరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, నారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈవిషయంపై కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీని వివరణ కోరేందుకు ఫోన్‌చేసినా ఎత్తకపోవడం గమనార్హం. కాగా, ఈవిషయంపై దేవగుడిలో ఇరువర్గాల మధ్య రాజీ చేసినట్లు సమాచారం.

హుండీ ఆదాయం రూ.10.24 లక్షలు

గుర్రంకొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీనరసింహస్వామి హుండీని సోమవారం టీటీడీ అధికారులు లెక్కించారు. స్వామి వారికి నాలుగు నెలలకు హుండీ ద్వారా రూ.10,24,720 ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. ఈ మొత్తాన్ని టీటీడీ అభివృద్ధికి వినియోగించనుంది. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి రూ.2.73 లక్షల ఆదాయం

తంబళ్లపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయానికి పరకామణి (హుండీ) ద్వారా రూ.2,73,320 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సోమవారం ఆలయంలో టీటీడీ అధికారులు, ఏఈవో గోపినాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్ ఆధ్వర్యంలో అక్టోబరు నుంచి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించారు.


యువతి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువతి అదృ శ్యంపై కేసు నమోదు చేసిన ట్లు టూటౌన్ సీఐ రామచంద్ర పేర్కొన్నారు. మదనపల్లె పట్టణం నెమలినగర్ సమీపంలోని వడ్డిపల్లెకు చెందిన వెంకటర మణ కుమార్తె నాగలక్ష్మి (23) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బాధితురాలు తండ్రి ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

సమస్యల వలయంలో సర్కారు బడి

సిద్దవటం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తమ పాఠశాలలో నెలకొన్న సమస్యలు పరిష్కరించాలని మండలంలోని రామస్వామిపల్లె ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు వేడుకుంటున్నారు. మండల కేంద్రంలోని ఎస్టీ కాలనీలో రామస్వామి ప్రభుత్వ పాఠశాలలో 10 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. పాఠశాల భవనం పైకప్పు పెచ్చులూడి పడడంతోపాటు, కూలిపోవడానికి సిద్ధంగా ఉండడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తాగునీటి సమస్య ఉండడంతో ఇంటినుంచి తెచ్చుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. వంట ఏజెన్సీ లేకపోవడంతో తాత్కాలికంగా పద్మ అనే మహిళ మెనూ సిద్ధం చేస్తోందని, పిల్లల తల్లిదండ్రుల సమావేశం ఏర్పాటు చేసి కొత్త ఏజెన్సీ ఎన్నుకోవాలని కోరుతున్నారు. ఈ విషయంపై. మండల విద్యాశాఖ అధికారి విలియం బాబు మాట్లాడుతూ రామస్వామిపల్లె ప్రాథమిక పాఠశాల సమస్యలపై ఉన్నతాధికారులకు నివేదిక పంపించామని తాగునీటి సమస్య పరిష్కరిస్తామని, విద్యాకమిటీ సమావేశం ఏర్పాటు చేసి వంట ఏజెన్సీ నియామకానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు.





రామస్వామిపల్లె ప్రాథమిక పాఠశాల భవనం, పెచ్చులూడుతున్న పైకప్పు

పంచాయతీ కార్యదర్శుల కార్యవర్గం ఎన్నిక

లక్కిరెడ్డిపల్లె, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని పంచాయతీ కార్యదర్శులు సోమవారం స్థానిక ఎంపీడీవో సభా భవనంలో సమావేశమై మండల విస్తరణ అధికారి ఉషారాణి అధ్యక్షతన మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు, గౌర వాధ్యక్షుడుగా అనంతపురం గ్రామ కార్యదర్శి సుదర్శన్‌రెడ్డి, కార్యదర్శిగా మద్దిరేవుల కార్యదర్శి రజనీశ్ రెడ్డి, ఉపాధ్యక్షులుగా కోనంపేట డిజటల్‌అసిస్టెంట్ అరవింద్, మల్లికార్జునరెడ్డిని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.

పశువ్యాధులపై అవగాహన అవసరం

సుండుపల్లె, జనవరి27(ఆంధ్రజ్యోతి): పశువుల వ్యాధులపై అవగాహన కలిగి ఉండాలని పశుసంవర్ధకశాఖ సహాయ సంచాలకులు డాక్టర్ విజయ్‌కుమార్ పశు పోషకులకు సూచించారు. సోమవారం దూడలు, గొర్రెలు, మేకల్లో నట్టల నివారణ చాలా ప్రధానమని తెలిపారు. గర్భకోశ వ్యాధులను ఎప్పటికప్పుడు గుర్తించి చికిత్స చేయించుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రవికుమార్, పశు సంవర్ధకశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

సిద్దవటం : మాధవరం, కడపాయపల్లె గ్రామంలో వెటర్నరీ అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీదేవి ఆధ్వర్యంలో పశు ఆరోగ్య శిబిరాలు నిర్వహించారు. పశు వైద్యాధికారులు డాక్టర్ శివశంకర్, డాక్టర్ శ్వేత, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు.

'చలో విజయవాడ' జయప్రదం చేయండి

సిద్దవటం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎస్సీ వర్గీకరణ సాధన కోసం ఫిబ్రవరి 5న విజయవాడలోని విజయవాడ ఐలాపురం కన్వెన్షన్ హాల్లో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని మండల ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు మునిచంద్ర పిలుపునిచ్చారు. ఎమ్మార్పీ ఎస్ కార్యదర్శి మునెయ్య, మండల ఉపాధ్యక్షుడు సంగటి వెంకటసుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించండి

సిద్దవటం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సమస్య పరిష్కరించాలంటూ మండల కేంద్రంలోని వెంకటేశ్వరస్వామి గుడి రహదారిలో ఉన్న మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో ఆందోళన చేశారు. నెల రోజులుగా తాగునీరు సరఫరా కాకపోవడంతో, కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. ఈ విషయంపై గ్రామ పంచాయతీ సెక్రటరీ సుజాత మాటాడుతూ 24 గంటల్లో సమస్య పరిష్కరిస్తామని తెలిపారు.

పారిశ్రామిక విప్లవం సీఎం లక్ష్యం: సుగవాసి



సమావేశంలో మాట్లాడుతున్న సుగవాసి బాలసుబ్రమణ్యం

రాయచోటిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర అభివృద్ధికి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఆయన తనయుడు ఐటీ , విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ నిరంతరం కృషి చేస్తున్నారని రాజంపేట నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి సుగవాసి బాలసుబ్రమణ్యం అన్నారు. సోమవారం ఆయన గాలివీడు రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో పారిశ్రామిక విప్ల వాన్ని తీసుకు రావడమే లక్ష్యంగా ముఖ్య మంత్రి పనిచేస్తున్నారన్నారు. 20 లక్షల ఉద్యోగాలు కల్పించాలనే లక్ష్యంతో దావోస్‌లో చేసిన కృషి సత్ఫలితాలను ఇస్తోందన్నారు. జగన్‌రెడ్డి ఐదేళ్లలో తీసుకు రాలేనన్ని పెట్టుబ డులు కూటమి ప్రభుత్వం ఏర్పడిన ఏడు నెలల్లోనే సాధించారన్నారు. రాష్ట్ర విభజన అనంతరం చంద్రబాబు కృషితో రాష్ట్రానికి వచ్చిన కంపెనీల నుంచి జగన్‌రెడ్డి కమిషన్లకు కక్కుర్తి పడడంతో పారిశ్రామికవేత్తలు రాష్ట్రం వదిలి పారిపోయారన్నారు. కేసుల నుంచి విముక్తి పొందేందుకు రాష్ట్రాన్ని తాకట్టు పెట్టడంతో పాటు , విశాఖ ఉక్కును అమ్మేందుకు జగన్‌రెడ్డి ప్రయత్నించాడన్నారు. గడిచిన ఐదేళ్లలో గాడి తప్పిన అన్ని రంగాలను చంద్రబాబు గాడిలో పెడుతున్నారన్నారు.

8 నెలల కాలంలో ఇప్పటికే రాష్ట్రానికి రూ.5 లక్షల కోట్లకుపైగా పెట్టుబడులతో సుమారు 50 కంపెనీలు రాష్ట్రానికి వచ్చాయని, తమ కార్యకలాపాలు మొదలుపెట్టాయన్నారు. రాష్ట్రానికి దశా దిశా చంద్రబాబు అనే విషయాన్ని రాష్ట్ర ప్రజలందరూ తెలుసుకొని కూటమి ప్రభుత్వాన్ని అధికారంలోకి తీసుకొచ్చారన్నారు.

యువగళం ఒక ప్రభంజనం

- రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు చమర్తి



కేక్ కట్‌చేస్తున్న చమర్తి జగన్‌మోహన్‌రాజు, వేణుగోపాల్ తదితరులు

రాజంపేట టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : యువగళం పాదయాత్ర ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం రాజంపేట టీడీపీ పార్లమెంట్ క్యాంప్ కార్యాలయంలో అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు, టీఎన్‌ఎస్‌ఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేవూరి వేణుగోపాల్ ఆధ్వర్యంలో కేక్ కట్‌చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2023 జనవరి 27న నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రారంభించారన్నారు. రాయలసీమ రాతను మార్చిన ఈ పాదయాత్ర టీడీపీ విజయంలో కీలకంగా నిలిచిందన్నారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు దగ్గుబాటి సుబ్రమణ్యం నాయుడు, జిల్లా టీఎన్‌ఎస్‌ఎఫ్ అధ్యక్షుడు పోలి శివ కుమార్, క్లస్టర్ ఇన్‌చార్జి కొల్లి రెడ్డయ్యనాయుడు, పట్టణ ప్రధాన కార్యదర్శి అబూబకర్ తదితరులు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు



మంత్రి మండిపల్లిని సన్మానిస్తున్న ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్ నేతలు

రాయచోటిటౌన్, జనవరి 27(ఆంధ్ర జ్యోతి:): జిల్లాలో పనిచేస్తున్న ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్ల సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడాశాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి తెలిపారు. నేషనల్ ఎలక్ట్రీషియన్స్ డే సందర్భంగా సోమవారం రాయచోటి పట్టణంలోని పీడీఆర్ కల్యాణ మండపంలో ప్రైవేటు ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోషియేషన్ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు రాయచోటి నియోజకవర్గంలో పని చేస్తున్న ఎలక్ట్రీషియన్ల సమస్యల పరిష్కారానికి కృషి చేయడంతోపాటు, అర్హులైనవారికి ఇంటి స్థలాలు మంజూరు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి గాజుల ఖాదర్‌బాషా, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైల్వేకోడూరు : స్థానిక గంగమ్మ భవన్‌లో నిర్వహించిన సమావేశంలో యువ నాయకుడు ముక్కా సాయివికాస్‌రెడ్డి మాట్లాడుతూ ఎలక్ట్రికల్ వర్కర్స్ అసోసియేషన్‌కు రైల్వేకోడూరులో ఒక భవనాన్ని ఏర్పాటు నిర్మిస్తామని తెలిపారు. రైల్వేకోడూరులో 250 మంది ఎలక్ట్రికల్ కార్మికులు ఉన్నారని, వారందరికీ ఇన్సూరెన్స్ కల్పిస్తామని హామీ ఇచ్చారు. పోతురాజు నవీన్, కొప్పరపు అరవింద్, కొరముట్ల నరసింహులు, రాజు పాల్గొన్నారు.

సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న దివ్యాంగులు

రాయచోటి కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నిరుద్యోగ దివ్యాంగులకు ఉపాధి అవకాశాలు పెం పొందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సబ్సిడీపై రుణాలు మంజూరు చేయాలని నిరుద్యోగ దివ్యాంగులు కోరారు. సోమవారం రాజంపేట డివిజన్ పరిధిలోని దివ్యాంగులు కలెక్టర్‌ను కలిసి తమ సమస్యలు విన్నవించుకున్నారు. శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ ప్రతినెల మూడో శుక్రవారం దివ్యాంగుల సమస్యలు, పరిష్కారాలపై ప్రత్యేక కార్యక్రమం నిర్వహిస్తున్నారని, అలాగే అన్నమయ్య జిల్లాలో కూడా ప్రతి నెలా ఏదో ఒక రోజు కొంత సమయం దివ్యాంగులకు కేటాయించాలని, రాజంపేటలో ఒక సాంకేతిక శిక్షణ కేంద్రం ఏర్పాటు చేయాలని కోరడం జరిగింది. జిల్లా పరిశ్రమలశాఖ, ఉపాధి కల్పనశాఖ, సూక్ష్మ మధ్య తర హా పరిశ్రమలశాఖ సంచాలకుల సమన్వయంతో ఉపాధి అవకాశాలు కల్పిం చాలని కోరారు. కార్యక్రమంలో బాలాజీ, కృష్ణయ్య, సునీల్‌కుమార్, మనోహర్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

గడువులోగా ఫిర్యాదులు పరిష్కరించాలి



ఫిర్యాదుదారులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటిటౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అందే ఫిర్యాదులను నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎం. వెంకటాద్రి ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ దివ్యాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులపై సత్వరమే సమగ్ర విచారణ చేసి పరిష్కరిస్తామని తెలిపారు. జిల్లా పోలీసు కార్యాలయానికి రాలేని ప్రజలు వారి పరిధిలోని పోలీస్‌స్టేషన్, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాల్లో ఫిర్యాదు చేయవచ్చునని సూచించారు. అక్కడ ఇచ్చే ఫిర్యాదులను కూడా ప్రజాసమస్యల పరిష్కారవేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేస్తామని తెలిపారు. ఫిర్యాదు దారులు తప్పకుండా ఆధార్‌కార్డు ఫొటోస్టాట్ కాపీని తీసుకుని రావాలని తెలియజేశారు.

వీవోఏలకు వేతన బకాయిలు చెల్లించాలి

రాయచోటి కలెక్టరేట్ , జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వీవోఏలకు 64 కాలపరిమితి సర్క్యులర్ రద్దు చేసి 8 నెలల వేతన బకాయిలు విడుదల చేయాలని జిల్లా సీఐటీయూ కార్యదర్శి ఏ. రామాంజులు డిమాండ్ చేశారు. సోమవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట యానిమేటర్లు సామూహిక దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత పీలేరు, రాయచోటి, తంబళ్లపల్లె నియోజకవర్గాల్లో కలకడ, కేవీపల్లి, చిన్నమండెం, గాలివీడు మండలాల్లో వీవోఏలపై రాజకీయ వేధింపులు పెరిగిపోయాయన్నారు. డీఆర్‌డీఏ అధికారులు ఇష్టానుసారం విధులనుంచి తొలగిస్తుంటే జిల్లా అధికారులు చూస్తున్నారు తప్ప, కూటమి నేతల అక్రమాలకు అడ్డు చెప్పే ధైర్యం చేయడం లేదని విమర్శించారు. కొంత మంది అధికారులు సంఘమిత్రలకు రికార్డులు అప్పగించాలని బెదిస్తున్నారని తెలిపారు. యానిమేటర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు, ప్రధాన కార్యదర్శులు, కోశాధికారి రాణి, రెడ్డెప్ప, సుబ్రమణ్యం, రెడ్డెప్పరెడ్డి, కృష్ణమ్మ మాట్లాడుతూ కిందిస్థాయి నాయకులు ముఖ్యమంత్రి ఆదేశాలను సైతం పట్టించుకోకుండా ప్రజల్లో వ్యతిరేకతకు కారణమవుతున్నారన్నారు. చోటా నాయకుల ఆగడాలు అరికట్టకుంటే ఉద్యమించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చాలి

రాయచోటి కలెక్టరేట్ , జనవరి27(ఆంధ్రజ్యోతి): వాల్మీకి బోయలను ఎస్టీ జాబితాలో చేర్చాలంటూ వాల్మీకి సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు మండ్ల జయశంకర్ ఆధ్వర్యంల ఆర్‌వీఎస్‌ఎస్ నాయకులు బండి పరశురాం, దొన్నికొండ ఆనంద్ సోమవారం కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి అంజనేయులు, మేకల శివప్రసాద్, ముద్దుల చిన్ననరసింహులు, జగన్ మోహన్‌రెడ్డి, రెడ్డెయ్య తదితరులు పాల్గొన్నారు.

పాత పట్టాలపైనే గృహాలు మంజూరు చేయాలి

గాలివీడు, జనవరి27(ఆంధ్రజ్యోతి): పాత పట్టాలపైనే గృహాలు మంజూరు చేయాలని రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం చేనేత అధ్యక్షుడు ఓర్సు వీర భాస్కర్ కోరారు. సోమవారం తహసీల్దార్ భాగ్యలత, ఆర్‌ఐ బాలాజీకి ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా గోపనపల్లి, చవడ గడ్డపల్లె గ్రామస్తులు మాట్లాడుతూ గతంలో 477/2ఏ3 సర్వే నెంబరులోని భూమిలో ఒక్కో కుటుంబానికి మూడు సెంట్లు చొప్పున ప్రభుత్వం పట్టాలు మంజూరు చేయగా, పలువురు ఇళ్లు నిర్మించుకున్నారన్నారు. కొంత మంది పునాదులు వేసుకున్నారని తెలిపారు. ఇప్పుడున్న జాగాలోనే మళ్లీ గృహాలు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. గోపనపల్లి కస్బాకు చెందిన ఖాజావీర్ అనే వ్యక్తి ఆ స్థలం తమదేనంటూ దౌర్జన్యం చేస్తున్నాడని ఫిర్యాదు చేశారు. ఏపీ వడ్డెర విద్యావంతుల వేదిక ప్రధాన కార్యదర్శి మారుతీశంకర్, జిల్లా ఉపాధ్యక్షుడు చల్లా రెడ్డెయ్య, తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కార్యదర్శులకు పని భారం తగ్గించాలి

లక్కిరెడ్డిపల్లె, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పనిభారాన్ని తగ్గించాలంటూ మండల పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షుడు సుదర్శన్ రెడ్డి .సోమవారం ఎంపీడీవో రెడ్డెయ్యకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏక కాలంలో మిస్సింగ్ సిటిజన్ సర్వే, నాన్ రెసిడెన్సియల్ సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, హౌస్‌హోల్డ్ జియో ట్యాగింగ్ సర్వే, పీఎస్‌సీపీ సర్వే అప్పగించి, వంద శాతం పూర్తి చేయాలని ఆదేశిస్తున్నారన్నారు. రెగ్యులర్ కార్యక్రమాలతో పాటు ఇతర శాఖల పనులు అప్పగించి అధిక భారాన్ని మోపుతున్నారని, దీంతో చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు, జయశ్రీ, గణేష్, రాజేష్, వేణుగోపాల్, సిరిబాబు, ఇమాంబాషా, మధుసూదన్ తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో బస్సులు నడపాలి

లక్కిరెడ్డిపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సకాలంలో బస్సులు నడపాలని దిన్నెపాడు ప్రజలు సోమవారం మంత్రి మండిపల్లె రాంప్రసాద్ రెడ్డికి వినతిపత్రం అందజేశారు. రాయచోటి నుంచి లక్కిరెడ్డిపల్లె దిన్నెపాడు, నీలకంఠరావుపేట మీదుగా కడపకు వెళ్లే ఆర్టీసీ బస్సు ఉదయం 6 గంటలకు రాయచోటి నుంచి బయలు దేరి ఉదయం 8 గంటలకు కడపకు చేరుకునేలా చర్యలు తీసుకుంటే విద్యార్థులు, రైతులకు ఉపయోగకరంగా ఉంటుందన్నారు. ఈ సర్వీసును రోజుకు 5 లేదా 6 సార్లు నడిపేలా చర్యలు తీసుకోవాలని కోరినట్లు టీడీపీ కార్యనిర్వహణ కార్యదర్శి శంకారపు జయరాం తెలిపారు. సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని మంత్రి హామీ ఇచ్చినట్లు తెలిపారు.

'నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయండి'

రామాపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాత్రి పూట విద్యాబోధన ద్వారా నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాలని ఎంపీడీవో జాషువా వలంటరీ టీచర్లకు సూచించారు. మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో సోమవారం మహిళా సంఘాల వలంటరీ టీచర్లకు విద్యాబోధనపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 13 గ్రామ పంచాయతీల పరిధిలోని 32 కేంద్రాల్లో 320 మంది నిర్లక్షరాస్యులకు రాత్రిపూట చదువు నేర్పించాలన్నారు. మార్చి 31 అనంతరం పరీక్ష రాయించాలన్నారు. ఎంపీడీవో కార్యాలయ ఏవో చాంద్‌బాషా, ఏపీఎం దేవసేన, మహిళా సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఇంటి పట్టాలు మంజూరు చేయండి

రైల్వేకోడూరు రూరల్, జనవరి27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల పట్టాలు మంజూరు చేయాలంటూ వీవీఆర్ కండ్రిగ పంచాయతీ తాడివండ్లపల్లెవాసులు సోమవారం రైల్వేకోడూరు తహసీల్దార్ మహబూబ్‌చాంద్‌కు వినతిపత్రం అందజేశారు. పంచాయతీ పరిధిలోని సర్వే నెం 192లో 1.72 ఎకరాల్లోని ప్రభుత్వ స్థలంలో ఇంటి పట్టాలు ఇవ్వాలని కోరారు. రికార్డులు పరిశీలించి అర్హులకు పట్టాలు అందజేస్తామని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు శంకరయ్య, కిరణ్, శివయ్య, బాలాజీ, శివ కేశవులు, గ్రామస్తులు లక్ష్మీదేవి, అరణ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణల గుర్తింపు సర్వే ప్రారంభం

పెనగలూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పెనగలూరు గ్రామ పంచాయతీలో ఆర్ అండ్ బి రోడ్డుకు ఇరువైపులా ఆక్రమణల గుర్తింపు సర్వే సోమవారం నుంచి ప్రారంభమైనట్లు మండల సర్వేయర్ సుబ్రమణ్యం తెలిపారు. వర్షాల కారణంగా గత నెలలో సర్వే అర్థాంతరంగా ఆగిపోయింది. ఆ తర్వాత రెవెన్యూ సదస్సులు రావడంతో సర్వే బాగా ఆలస్యమైందన్నారు. 2 రోజుల్లో సర్వే కార్యక్రమాన్ని పూర్తి చేసి నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తున్నట్లు ఆయన తెలియజేశారు.

నాణ్యత ప్రమాణాలు పాటించాలి

సుండుపల్లె, జనవరి27(ఆంధ్రజ్యోతి): గ్రామీణ రోడ్ల ఏర్పాటులో నాణ్యత పాటించాలని పంచాయతీరాజ్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రామచంద్రనాయక్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలో సీసీ రోడ్డు పనులను ఆయన తనిఖీ చేశారు. ఆరెమ్మ దేవాలయం వీధిలో రోడ్డు పనులు త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు ఏర్పాటుతో పాటు కల్వర్టులు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఇంజనీరింగ్ ఆఫీసర్ జైసూర్యనాయక్, టీడీపీ మండల ఆర్గనైజింగ్ సెక్రటరీ శివరాంనాయుడు పాల్గొన్నారు.

నాన్ టీచింగ్ స్టాఫ్‌ను విధుల్లోకి తీసుకోవాలి

ఓబులవారిపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా విధు లనుంచి తొలగించినందుకు నిరసనగా మంగంపేట ఏపీఎండీసీ పబ్లిక్ స్కూల్ నాన్‌టీచింగ్ స్టాఫ్ రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారని ఏపీఎండీసీ ఎంప్లాయీస్ అండ్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో కార్మికుల పీఎఫ్ మొత్తాలు ఎగవేసి డిఫాల్టర్‌గా మారిన ఉషోదయ పబ్లిక్ ఎడ్యుకేషన్ ట్రస్టుకు ఎలాంటి టెండరు లేకుండా అధికారులు మళ్లీ బాధ్యతలు అప్పగించారని ఆరోపించారు. ప్రతి రోజు ఆఫీసు వద్ద ధర్నా చేస్తున్నా పట్టించుకోకపోవడంతో రిలే దీక్షలు చేస్తు న్నామని తెలిపారు.

భూములను కాపాడండి

వీరబల్లి, జనవరి27(ఆంధ్రజ్యోతి): తమ పట్టా భూముల్లో మైనింగ్ మాఫియాకు చెందిన వారు రాళ్లు నాటారంటూ మండలంలోని గుర్రప్పగారిపల్లె పంచాయతీ తొగటపల్లి రైతులు సోమవారం తహసీల్దార్ శ్రావణికి ఫిర్యాదు చేశారు. ఈ భూముల్లో మైనింగ్‌కు ప్రభుత్వం తమకు అనుమతులు మంజూరు చేసిందంటూ రాళ్లు నాటారని ఫిర్యాదులో పేర్కొన్నారు. ఎన్నో ఏళ్లుగా ఈ భూములు సాగు చేసుకుంటున్నామని అవి లేకపోతే తాము జీవనాధారం కోల్పోతామన్నారు. ఈ విషయం ఉన్నతాధికా రులకు తెలిపి చర్యలు తీసుకుంటామనితహసీల్దారు హామీ ఇచ్చారు.

'కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలి'

రాయచోటిటౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల ఆత్మహత్యలకు కారణమవుతున్న కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు నేతి నాగేశ్వర, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి నరసింహ డిమాండ్ చేశారు. సోమవారం రాయచోటి పట్టణంలోని మాసాపేట బ్రిడ్జి సమీపంలోని అంబేద్కర్ విగ్రహం ఆందోళన చేశారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా సహాయ కార్యదర్శి అశోక్, ఎస్‌ఎఫ్‌ఐ విద్యార్థి సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు గురునాథ్, పవన్‌నాయక్, సంఘాల నాయకులు పాల్గొన్నారు.

రాజంపేట: కార్పొరేట్ విద్యాసంస్థల ఫీజుల దోపిడీని అరికట్టాలని విద్యార్థుల ఆత్మహత్యలపై ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ, ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు ఆందోళన చేశారు. పీడీఎస్‌యూ మండల అధ్యక్షుడు వెంకట మహేందర్, ఎస్‌ఎఫ్‌ఐ జిల్లా సహాయ కార్యదర్శి మదన్ పీడీఎస్‌యూ జిల్లా నాయకులు రామ్‌చరణ్, తదితరులు పాల్గొన్నారు.

20 సూత్రాల చైర్మన్‌తో సాయిలోకేశ్ భేటీ

రాజంపేట,జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర 20 సూత్రాల కార్యక్రమాల అమలు చైర్మన్ లంక దినకర్‌ను విజయవాడలోని ఆయన చాంబర్‌లో అన్నమయ్యజిల్లా బీజేపీ అధ్యక్షుడు సాయిలోకేష్ సోమవారం కలిశారు. జిల్లాలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను కేంద్ర వ్యవసాయమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరారు. అనంతరం జిల్లాలోని వివిధ దేవాలయాల్లో అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలని దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డిని కలిసి విన్నవించినట్లు తెలిపారు.

జూనియర్ అసిస్టెంట్‌కు సన్మానం

ఓబులవారిపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : ఉత్తమ ఉద్యోగిగా కలెక్టర్ నుంచి అవార్డు అందుకున్న చిన్నఓరంపాడు ప్రభుత్వ జూనియర్ కళాశాల జూనియర్ అసి స్టెంట్ సూరపురాజు శివప్రసాద్‌ను సోమ వారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ డీఆర్ హరిత ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ కార్య క్రమంలో పీడీ శారద, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి చేయాలి

రైల్వేకోడూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో పెండింగ్‌లో ఉన్న ప్రాజెక్టులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షుడు పండుగోల మణి డిమాండ్ చేశారు. సోమవారం సీపీఐ కార్యాలయంలో ఏర్పాటు చేసి మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ గొట్టిమానుకోన, చాకిరేవుకోన, వాగేటికోన, బండరేవులకోన మైనర్ ఇరిగేషన్ ప్రాజెక్టుల పనులు పూర్తి చేస్తే సాగునీరు అందుతుందన్నారు. కోడూరు-వెంకటగిరి రోడ్డు, అప్పా జ్యూస్ పరిశ్రమ, ఆర్టీసీ డిపో, శీతల గిడ్డంగులు, ఉద్యాన హబ్ తదితరాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. మామిడి, బొప్పాయి, అరటి పంటలకు గిట్టుబాటు ధరలు కల్పించాలన్నారు. కరోనా సమయంలో రైల్వేకోడూరులో స్టాపింగ్ నిలిపివేసిన రైళ్లను పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. మంగంపేట ముగ్గురాయి మిల్లులకు తక్షణమే రాయి సరఫరా చేయాలన్నారు. ఏపీఎండీసీ కార్మికుల సమస్యలు పరిష్కరించా లన్నారు. నిరుపేదలకు ఇంటి స్థలాలిచ్చి, ఇల్లు ప్రభుత్వమే నిర్మించేటట్లు చూడాలన్నారు. దళిత, గిరిజన గ్రామాలకు రోడ్లు, విద్యుత్ తదితర సౌకర్యాలు కల్పించాలన్నారు. పేదలకు వ్యవసాయ భూములు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో సీపీఐ ఏరియా కార్యదర్శి జ్యోతి చిన్నయ్య, కార్యదర్శి దార్ల రాజశేఖర్, నాయకులు ఎం. జయరామయ్య, మోడి శివయ్య, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

హద్దు రాళ్ల ధ్వంసంపై ఫిర్యాదు

పుల్లంపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పెరియవరం శ్మశానానికి చెందిన హద్దు రాళ్ల ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని మండల బీజేపీ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి ఆధ్వర్యంలో గ్రామస్థులు సోమవారం తహసీల్దారు అరవిందకిషోర్‌కు ఫిర్యాదు చేశారు. ఇటీవల సర్వే అధికారులు స్మశాన స్థలానికి హద్దులు ఏర్పాటు చేశారని వాటిని ధ్వంసం చేసినవారిపై చర్యలు తీసుకోవాలని తహశిల్దారును కోరారు. బీజేపీ జిల్లాకార్యవర్గ సభ్యులు రామసుబ్బారెడ్డి, శివరామరాజు, రామచంద్రరాజు, కృష్ణంరాజు, గణపతిరాజు పాల్గొన్నారు.

ట్రావెల్స్ బస్సు బోల్తా.. 11 మందికి గాయాలు



గుడిపాడు వద్ద బోల్తాపడిన ప్రైవేటు ట్రావెల్స్ బస్సు

దువ్వూరు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గుడిపాడు సమీపంలో హైదరాబాదు నుంచి చిత్తూరుకు వెళుతున్న జగన్ ట్రావెల్స్ ప్రైవేటు బస్సు సోమవారం తెల్లవారుజామున 3.30గంటల ప్రాంతంలో బోల్తా పడింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 11 మందికి స్వల్ప గాయాలైనట్లు ఎస్ఐ వినోద్ కుమార్ తెలిపారు. డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో ప్రమాదం జరిగినట్లు తెలిపారు. గాయపడిన వారిలో చిత్తూరులోని ఒకే కుటుంబానికి చెందిన 10 మంది ఉన్నారన్నారు. వీరిని ప్రాథమిక చికిత్స నిమిత్తం మైదుకూరుకు.. అనంతరం కడప రిమ్స్‌కు తరలించినట్లు తెలిపారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

వరుస చోరీలతో భయం భయం

- సన్నుపల్లెలో ఇంట్లో దొంగతనం
- 13 తులల బంగారు, రూ.1.5 లక్షల నగదు అపహరణ



సన్నుపల్లెలో చోరీ జరిగిన ఇంటిలో పరిశీలిస్తున్న సీఐ

ఖాజీపేట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో వరుసదొంగతనాలు జరుగుతుండడంతో ప్రజలు భయభ్రాంతులకుగురవుతున్నారు. ఆదివారం భూమాయపల్లెవద్దగల భీమలింగేశ్వరస్వామి ఆలయంలో చోరీకి పాల్పడగా.. సోమవారం తెల్లవారుజామున సన్నుపల్లె గ్రామానికి చెందిన తుమ్మలూరు రవీంద్రారెడ్డి ఇంటిలో దొంగతనానికి పాల్పడ్డారు. రవీంద్రారెడ్డి మిద్దెపైన నిద్రిస్తుండగా కింద ఇంటి తలుపుల తాళాలు తొల గించి లోనికి ప్రవేశించి బీరువాలోని 13 తులాల బంగారు,రూ.1.50లక్షలు నగదు చోరీ చేశారు. ఉదయం యజమాని కిందకు వచ్చి దొంగతనం జరిగిందని గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆమేరకు సీఐ సంఘటన స్థలానికి చేరుకుని క్లూస్‌టీంను పిలిపించి నమూనాలను సేకరించి దొంగలకోసం గాలింపు చేపడుతున్నామని, త్వరలోనే దొంగలను పట్టుకుంటామని సీఐ తెలిపారు.

80 మద్యం సీసాలు స్వాధీనం



వివరాలు వెల్లడిస్తున్న ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్

కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం చిన్నచౌకులోని ఫక్కీరుపల్లెలో దాడులు నిర్వహించి ఇరువురిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సీఐ క్రిష్ణకుమార్ తెలిపారు. చిన్నచౌకులోని ఎక్సైజ్ పోలీసుస్టేషనులో ఆయన విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. కడపకు చెందిన శివయ్య, బొల్లు బాలక్రిష్ణలు మిలిటరీకి చెందిన 80 (750 ఎంఎల్) మద్యం సీసాలను ఇరువురు ద్విచక్ర వాహనంలో తీసుకెళుతున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో దాడి చేశామన్నారు. మద్యంబాటళ్లు, బైకు స్వాధీనం చేసుకుని నిందితులను రిమాండుకు తరలించినట్లు తెలిపారు. మద్యం, బైకు విలువ రూ.2.65 లక్షలు ఉంటుందన్నారు. ఈ దాడుల్లో ఎక్సైజ్ సిబ్బంది నరసిరహారావు, చంద్రశేఖర్, గురు ప్రసాద్‌లు పాల్గొన్నారు. పట్టుబడిన మద్యంసీసాలు మిలిటరీకి చెందిన పేర్లున్నప్పటికీ అందులో నకిలీవిగా ఉన్నట్లుగా గుర్తించి క్వాలిటీ టెస్టు కోసం పంపినట్లు సీఐ తెలిపారు.

మద్యం అమ్ముతున్న వ్యక్తి అరెస్టు

కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం దొరల గోరీల వద్ద అక్రమంగా మద్యం అమ్ముతున్న వ్యక్తిని అరెస్టు చేసినట్లు టూటౌన్ సీఐ నాగార్జున తెలిపారు. నగరంలోని దండోరా కాలనీకి చెందిన జూటూరు దస్తగిరి దొరల గోరీల వద్ద బెల్టుషాపు నిర్వహిస్తూ అక్రమంగా మద్యం బాటిళ్లు అమ్మేవాడు. ఈ సమాచారం రావడంతో ఎస్ఐ హుసేన్ సిబ్బందితో కలిసి దాడి చేసి దస్తగిరిని అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి 19 క్వార్టర్ బాటళ్లు స్వాధీనం చేసుకుని.. నిందితున్ని రిమాండుకు తరలించామని తెలిపారు.

బావపై బామ్మర్ది దాడి



కడప క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప నగరం అశోక్‌నగర్‌లో సోమవారం ఉదయం బావపై బామ్మర్ది దాడి చేశా డు. ఈ దాడిలో బావ తలకు గాయమైం ది. అశోక్‌నగర్‌కు చెందిన దివాకర్ అతని బావ మరిది దినకర్‌ల మధ్య మనస్పర్థలు ఉండేవి. ఈ నేప థ్యంలో ఇరువురి మధ్య మాటమాట పెరగ డంతో దివాకర్‌పై దినకర్ రాయితో దాడి చేయగా తలకు గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం దివాకర్‌ను రిమ్స్‌కు తరలించారు. బాధితుడు చిన్నచౌకు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యం

- కలెక్టర్ చామకూరి శ్రీధర్



అర్జీదారుల నుంచి వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ చామకూరి శ్రీధర్

రాయచోటి (కలెక్టరేట్), జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రథమ ప్రాధాన్యత ఇచ్చి బాధ్యతగా పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు.

ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక ద్వారా అందిన ప్రజల సమస్యలను అత్యంత ప్రాధాన్యతతో బాధ్యతగా పరిష్కరించాలన్నారు. ముఖ్యమంత్రి కార్యాలయం కూడా ఫిర్యాదుల పరిష్కారంపై నేరుగా పర్యవేక్షణ చేస్తున్నారని తెలిపారు. ప్రతి సమస్యను, ప్రజల నుంచి వచ్చే ఫీడ్‌బ్యాక్‌ను ప్రభుత్వం సీరియస్‌గా పరిశీలిస్తుందని, కాబట్టి అధికారులందరూ ప్రాధాన్యతగా ఫిర్యాదులను నూరుశాతం పరిష్కరించాలన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

సిద్ధేశ్వరస్వామి ఆలయ భూములపై కలెక్టర్‌కు ఫిర్యాదు

- 63 ఎకరాల కౌలు విషయం తేల్చాలని వినతి
- స్పందించిన కలెక్టర్.. న్యాయం చేస్తామని హామీ



కలెక్టర్ కార్యాలయం ఆవరణలో నిరసన వ్యక్తం చేస్తున్న కలమల్ల వాసులు

ఎర్రగుంట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పాత కలమల్లలోని సిద్ధేశ్వర స్వామి ఆలయానికి చెందిన మాన్యం భూముల కౌలు చెల్లింపు, అన్యాక్రాంతంపై ఆలయ అభివృద్ధి కమిటీ, సర్పంచి, ఉపసర్పంచులు సోమవారం స్పందనలో కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. కలమల్ల గ్రామానికి చెందిన సుమారు 200 మంది గ్రామస్థులు కలెక్టరేట్ వద్ద నిరసన తెలిపారు. 2011 నుంచి నేటి వరకు కొత్త కలమల్ల ఆలయ కమిటీకి కౌలును కేటాయిస్తూ ఏకపక్షంగా వ్యవహరిస్తున్న దేవదాయ అధికారులపై చర్యలు తీసుకోవాలని కలెక్టర్‌ను కోరారు. వివరాల్లోకి వెళితే.. పాత కలమల్ల గ్రామంలో సిద్ధేశ్వరస్వామి ఆలయానికి 60 ఎకరాలు మాన్యం కింద కేటాయించారు. కాగా, అదే గ్రామంలో సర్వే నెంబరు 399/1లో ఒక రైతు పొలంలో శివాలయం నిర్మించారు. దీన్ని సిద్ధేశ్వరస్వామి ఆలయంగా పరిగణించి.. దేవదాయ అధికారులు 2011 నుంచి నేటి వరకు పాత సిద్ధేశ్వరస్వామి మాన్యం భూములను కౌలుకు కేటాయిస్తున్నారు. దీంతో గ్రామంలోని ప్రజలు రెండు వర్గాలుగా విడిపోయి.. వారి మధ్య వైషమ్యాలు తారాస్థాయికి చేరాయి. ఈ విషయంపై పాత కలమల్లలోని సిద్ధేశ్వరస్వామి ఆలయ కమిటీకి చెందిన మాజీ సర్పంచి వి.క్రిష్ణయ్య, పి.శ్రీను, వి.సూర్యుడు, నారాయణ, గిరి, పి.శ్రీనివాసులు, శంకరయ్య, రామాంజనేయులు, ధనుంజయరెడ్డి, సాంబశివారెడ్డి, సర్పంచి సి.హెప్సీబా, ఉప సర్పంచి పంజగల విజయలక్ష్మి, గ్రామ ప్రజలు సోమవారం కలెక్టర్ చెకుకూరి శ్రీధర్‌కు ఫిర్యాదు చేశారు. పూర్తిగా విచారించి న్యాయం చేయాలని కోరారు. ఇందుకు స్పందించిన కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఎండోమెంట్, రెవెన్యూ, కలెక్టర్ కార్యాలయ అధికారులతో కమిటీ వేసి సున్నితమైన ఈ అంశాన్ని వెంటనే పరిష్కరించాలని దేవదాయ అసిస్టెంట్ కమిషనర్ మల్లికార్జున ప్రసాద్‌ను ఆదేశించారు. రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించి 15 రోజులలోపు నివేదికను తనకు సమర్పించాలని ఆదేశించినట్లు గ్రామస్థులు పేర్కొన్నారు.

మా ప్రభుత్వంలో... మాపైనే అక్రమ కేసులా?

- ఉపసంహరించి న్యాయం చేయండి
- సీఐకు నాలుగు మండలాల కన్వీనర్ల వినతి



సీఐ జీవన్‌గంగనాథ్‌బాబుకు వినతి పత్రం ఇస్తున్న టీడీపీ కన్వీనర్లు

బి.కొత్తకోట, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మా ప్రభుత్వంలో మాపైనే అక్రమ కేసులు బనాయించడం ఏంటని, అక్రమ కేసుల విషయమై పునరాలోచించి ఉపసంహరించాలని తంబళ్లపల్లె నియోజకవర్గంలోని నాలుగు మండలాల టీడీపీ కన్వీనర్లు సోమవారం బి.కొత్తకోట సీఐ జీవన్‌గంగనాథ్‌బాబును కోరారు. ఇతర ముఖ్య నాయకులతో కలిసి ఈ మేరకు వినతిపత్రాన్ని అందజేశారు. ఈనెల 23న టీడీపీ యువనేత, రాష్ట్ర మంత్రి నారాలోకేశ్ జన్మదినం సందర్భంగా బి.కొత్తకోటలో టీడీపీ నాయకులు ఫ్లెక్సీలను కట్టగా వాటిని గుర్తుతెలియని వ్యక్తులు రాత్రివేళలో చించివేశారు. అయినా నాయకులు ఆ ఫ్లెక్సీలను మళ్లీ కట్టి, కేక్ కట్‌చేసి అన్నదానం చేశారు. అయితే ఏకంగా లోకేశ్ ఫ్లెక్సీలనే చింపే సాహసం చేసిన వారిని గుర్తించి కేసు నమోదు చేయాలంటూ తెలుగుయువత టౌన్‌కన్వీనర్ రాజా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కాగా ఫ్లెక్సీలు చించినవారిని గుర్తించకపోగా తంబళ్లపల్లె మండలానికి చెందిన ఓ వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆ ఫ్లెక్సీలను తమకు తామే చింపుకుని, నియోజకవర్గ ముఖ్య నాయకుడిపై నిందలు వేశారంటూ మాజీ ఎమ్మెల్యే జి.శంకర్ వ్యక్తిగత సహాయకుడితో పాటు 8 మందిపై కేసు నమోదుచేశారు. దీంతో ఆందోళన చెందిన బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు, పెద్దమండ్యం మండలాల టీడీపీ కన్వీనర్లు నారాయణస్వామిరెడ్డి, ఆనందరెడ్డి, పాలగిరిసిద్దా, జిట్టా రమణలు సీఐని కలిసి వినతిపత్రం ఇచ్చారు. ఆరోజు రాత్రి ఓ తెల్లరంగు స్కార్పియో వాహనంలో వచ్చిన వ్యక్తులే ఫ్లెక్సీలను చింపారని, ఆ వాహనం ఎవరిదన్న విషయంపై విచారిస్తే అంతా బయటపడుతుందన్నారు. టీడీపీ కార్యకర్తలపై నమోదైన ఎఫ్ఐఆర్ 9-2025ను రద్దు చేయాలని కోరారు. ఆ సంఘటనకు సంబంధించిన సీసీటీవీ ఫుటేజ్‌ను పోలీసులకు అందచేసినట్టు నాయకులు తెలిపారు. సీఐని కలిసిన వారిలో నియోజకవర్గ పోల్ కో-ఆర్డినేటర్ కుడుం శ్రీనివాసులు, పార్లమెంటు బీసీ సెల్ అధ్యక్షుడు సురేంద్రయాదవ్, పట్టణ అధ్యక్షుడు బంగారు వెంకట్రమణ, సుకుమార్, సుదర్శన్‌రెడ్డి, కనకంటి ప్రసాద్, సురేంద్ర, కుమార్, ప్రకాష్, నాగరాజు తదితరులున్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన

పెద్దతిప్పసముద్రం జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని తుమ్మరకుంట గ్రామంలో సోమవారం యంగ్ ఇండియా సేవా ఫౌండేషన్ వారి ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత క్యాన్సర్ వైద్యశిబిరానికి విశేష స్పందన లభించింది. బెంగళూరుకు చెందిన ఆసుపత్రికి చెందిన ప్రముఖ వైద్య నిపుణులు డాక్టర్ లోకేష్ భరణి ఉచిత శిబిరంలో సుమారు 150 మందికి వైద్య పరీక్షలను నిర్వహించారు. ఇందులో 20 మందికి క్యాన్సర్ ఉన్నట్లు నిర్ధారణ అయినట్లు డాక్టర్లు పెర్కొన్నారు. వీరికి ఆసుపత్రి యాజమాన్యం ఉచిత బస్సు సౌకర్యం కల్పించి బెంగళూరులోని తమ ఆసుపత్రిలో ఉచితంగా ఆపరేషన్ చేయించి వారిని తమ గ్రామానికి చేర్చుతామన్నారు. యంగ్ ఇండి యా సేవా ఫౌండేషన్ అధ్యక్షుడు తగాది రాజశేఖర్, సభ్యులు పాల్గొన్నారు.

సంఘమిత్ర పై విచారణ

పెద్దమండ్యం, జనవరి 27(ఆంధ్రజ్యోతి) పెద్దమండ్యం మండలం పాపేపల్లి గ్రామ పంచాయతీ లోని వెలుగు సంఘాల సంబంధించిన ఓ సంఘ మిత్ర పనితీరు పై ఏపీఎం నరసింహులు విచారణ చేపట్టారు. విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలతో జిల్లా అధికారులకు ఆ గ్రామంలోని పలు వెలుగు సంఘాలు ఫిర్యాదు చేసినట్లు ఏపీఎం వెల్లడించారు. ఈ ఫిర్యాదు పై విచారణ నివేధికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

పంజాబ్ విజయ లక్ష్యం... 140 పరుగులు

కడప స్పోర్ట్స్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కడప వైయస్ రాజారెడ్డి ఏసీఏ క్రికెట్ స్టేడియంలో ఆంధ్రా-పంజాబ్ జట్ల మధ్య జరుగుతున్న కల్నల్ సీకే నాయుడు ట్రోఫీలో భాగంగా మూడవ రోజైన సోమవారం ఆట ముగిసే సమయానికి పంజాబ్ జట్టు విజయానికి మరో 140 పరుగుల దూరంలో నిలిచింది. వివరాలిలా.....తొలుత ఈనెల 25న బ్యాగింగ్ చేసిన ఆంధ్రా జట్టు మొదటి ఇన్నింగ్స్‌లో 83 ఓవర్లలో 211 పరుగులకు ఆలౌట్ అయిన సంగతి తెలిసిందే. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన పంజాబ్ జట్టు 45.1 ఓవర్లలో 119 పరుగులకు ఆలైట్ అయింది. దీంతో రెండవ ఇన్నింగ్స్‌కు దిగిన ఆంధ్రాజట్టు 62.1 ఓవర్లలో 162 పరుగులకు చేతులెత్తేసింది. ఇందులో ప్రసాద్ 68 పరుగులు చేశారు. దీంతో పంజాబ్ జట్టుకు విజయలక్ష్యంగా 255 పరుగులు నిర్ధేశించింది. విజయమే లక్ష్యంగా బరిలోకి దిగిన పంజాబ్ జట్టు తన రెండో ఇన్నింగ్స్‌లో మూడవ రోజు ఆట ముగిసే సమయానికి 43 ఓవర్లలో 1 వికెట్ నష్టపోయి 115 పరుగులు చేసింది. జస్కారన్‌వీర్ సింగ్‌పాల్ 56 పరుగులతో, ఉదయ్ సాహరన్ 57 పరుగులతో నాటౌట్‌గా క్రీజ్‌లో వున్నారు. కాగా విజయానికి చివరి రోజైన మంగళవారం మరో 140 పరుగుల దూరంలో వుంది.

సుండుపల్లె రెసిడెన్షియల్ స్కూల్‌కు అదనపు నిధులు మంజూరు

కలికిరి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): సుండుపల్లెలోని గిరిజన సంక్షేమ వసతి గృహాన్ని బాలుర రెసిడెన్షియల్ పాఠశాలగా మార్చేందుకు అదనంగా మరో రూ.8.10 లక్షలు మంజూరు చేస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీ చేసింది. గతంలో ఈ పాఠశాల నిర్మాణానికి రూ.1.80 కోట్లు మంజూరయ్యాయి. అయితే కాంట్రాక్టరు 3.9 శాతం ఎక్కువగా టెండర్ వేసినందువల్ల అంచనా వ్యయం పెరిగింది. అంతేగాకుండా కొత్త మరుగుదొడ్ల బ్లాక్‌కు సెప్టిక్ ట్యాంకు నిర్మించినందుకు కూడా అదనపు నిధులు అవసరమయ్యాయి. గిరిజన సంక్షేమ శాఖ చీఫ్ ఇంజినీరు ఈ మేరకు అదనపు నిధుల కోసం ప్రభుత్వానికి పంపిన ప్రతిపాదనలను ఆమోదించి అదనంగా మరో రూ.8.10 లక్షలు మంజూరు చేస్తూ గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి ఎం.ఎం.నాయక్ సోమవారం ఆదేశాలు జారీ చేశారు.

టీడీపీ నాయకుడు మహమూద్‌బాషా మృతి

వాల్మీకిపురం, జనవరి 27(ఆంధ్రజ్యోతి):నల్లారి సానుభూతి పరుడు టీడీపీ నాయకుడు అయిన వాల్మీకిపురంకు చెందిన షేక్ మహమూద్‌బాషా(78) ఆదివారం రాత్రి మృతి చెందాడు. గతంలో ఐదేళ్ల పాటు మహమూద్‌బాషా ఉప సర్పంచ్‌గా సేవలందించాడు. విషయం తెలుసుకున్న ప్రజాప్రతినిదులు, టీడీపీ నాయకులు, మైనార్టీ నాయకులు, తదితరులు సోమవారం మహమూ ద్‌బాషా భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన కుటుంబీకులను పరామర్శించారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ ప్రజాప్రతినిధిగా నల్లారి సానుభూతి పరుడిగా ఉంటూ ఎన్నో సేవా కార్యక్రమాలలో పాల్గొన్న మంచి మనిషి మహమూద్‌బాషా అని ఆయన లేని లోటు తీరనిదన్నారు.

భారత్ షూటింగ్ బాల్ జట్టుకు మహమ్మద్ యూసఫ్ ఎంపిక



మదనపల్లె అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నేపాల్ దేశంలో ఫిబ్రవరి 1 నుంచి 3వ తేదీ వరకు జరగనున్న ఏషియన్ షూటింగ్ బాల్ పోటీల్లో పాల్గొనే భారత జట్టులోకి మదనపల్లె పట్టణానికి చెందిన సీనియర్ షూటింగ్‌బాల్ క్రీడాకారుడు మహమ్మద్ యూసఫ్‌బాష ఎంపికైనట్లు షూటింగ్ బాల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా నుంచి ఉత్తర్వులు అందా యి. ఈనెల 30వ తేదీ డిల్లీలో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొంటారు. భారత్ జట్టుకు ఎంపికైన క్రీడాకారునికి ఏపీ షూటింగ్‌బాల్ అసోసియేషన్ కార్యదర్శి పరుశురాముడు ప్రత్యేకంగా అభినందనలు తెలిపారు. దక్షిణ భారత దేశం నుంచి మదనపల్లెకు చెందిన యూసఫ్‌బాష ఎంపిక కావడం మదనపల్లెకే గర్వకారణమని జిల్లా కార్యదర్శి గౌతమి, నరేశ్ తెలిపారు. యూసఫ్ బాష అంతర్జాతీయ పోటీల్లో రాణించి దేశానికి మంచిపేరు తీసుకురావాలని కోచ్, అన్నమయ్య షూటింగ్ బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు రమణారెడ్డి, వైస్ ప్రెసిడెంట్ రెడ్డి శ్రీనివాస్, సాగర్, కోశాధికారి సాయిశేఖరెడ్డి, సభ్యులు నాగేంద్రప్రసాద్, పవన్, సురేష్, సయ్యద్‌బాష, భారతి, మురళీ, క్రీడాభారతి అధ్యక్షులు దిలీప్‌కుమార్, విజయ్‌కుమార్, కరాటే సురేష్, క్రికెట్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు శ్రీధర్‌కుమార్, వ్యాయామ ఉపాధ్యాయులు ఖాదర్‌బాష , సీనియర్ క్రీడాకారులు మురళీ, ఉదయ్, శ్రీకుమార్, అభినందించారు.

నరసింహస్వామి హుండీ ఆదాయం రూ.10.24 లక్షలు

గుర్రంకొండ, జనవరి 27(ఆంధ్రజ్యోతి): గుర్రంకొండ మండలం తరిగొండ లక్ష్మీ నరసింహస్వామి హుండీని సోమవారం టీటీడీ అధికారులు లెక్కించారు. స్వామి వారికి నాలుగు నెలలకు హుండీ ద్వారా రూ.10,24,720 ఆదాయం వచ్చినట్లు ఆలయాధికారి కృష్ణమూర్తి తెలిపారు. ఈ మొత్తాన్ని టీటీడీ అభివృద్ధికి వినియోగించనుంది. కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

వెంకన్న ఆలయానికి రూ.2.73 లక్షల ఆదాయం

తంబళ్లపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తంబళ్లపల్లె మండలం కోసువారిపల్లెలో వెలసిన ప్రసన్న వేంకటరమణ స్వామి ఆలయానికి పరకామణి (హుండీ) ద్వారా రూ.2,73,320 ఆదాయం వచ్చినట్లు ఆలయ అధికారులు తెలిపారు. సోమవారం ఆలయంలో టీటీడీ అధికారులు, ఏఈవో గోపినాథ్, ఆలయ ఇన్‌స్పెక్టర్ దిశంత్‌కుమార్ ఆధ్వర్యంలో అక్టోబరు నుంచి భక్తులు హుండీలో సమర్పించిన కానుకలను లెక్కించారు.

డీలర్ల ఎంపికకు ఇంటర్వ్యూలు ప్రారంభం

మదనపల్లె టౌన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె రెవెన్యూ డివిజన్‌లో ఖాళీగా ఉన్న చౌకదుకాణాల డీలర్ల నియామకానికి సబ్‌కలెక్టర్ మేఘస్వరూప్ ఇంటర్వ్యూలు ప్రారంభించారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టరేట్ క్యాంపు కార్యాలయంలో తంబళ్లపల్లె, ములకలచెరువు, పీటీఎం మండలాలకు చెందిన 30 మందిని ఇంటర్వ్యూకు పిలువగా వారిలో 29 మంది అభ్యర్థులు హాజరయ్యారు. వారిని సబ్‌కలెక్టర్ ఇంటర్వ్యూ చేశారు. ఈనెలాఖరు వరకు డివిజన్‌లోని 11 మండలాలకు చెందిన 72 చౌకదుకణాల డీలర్ల నియామకానికి 251మందిని ఇంటర్వ్యూ చేయనున్నట్లు సబ్‌కలెక్టర్ తెలిపారు. ఇంటర్వ్యూకు హాజరైన అభ్యర్థుల ఆధార్‌కార్డు, రేషన్‌కార్డు, సర్టిఫికెట్లను ఇన్‌చార్జి డీఎవో రాఘవేంద్ర, డీటీ కుమారి పరిశీలించి, ఇంటర్వ్యూలకు పిలిచారు.

ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద ఘర్షణ

- భారీగా పోలీసుల మోహరింపు
- ఇరువర్గాలు ఎన్డీయేకి చెందినవారే...
- 30మందిపై కేసు నమోదు..?

ఎర్రగుంట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద లోడింగ్‌లో ఆధిపత్య పోరు సాగుతోంది. ఈ నేపధ్యంలో సోమవారం ఎన్డీయేకి చెందిన ఒక వర్గం వారు మరో వర్గంవారిపై దాడి చేశారు. ఆర్టీపీపీ యాష్ పాండ్ వద్ద కలమల్లకు చెందిన సంజీవరెడ్డి, అతని అల్లుడు నారాయణరెడ్డి, సోదరుడు విద్యాసాగర్‌రెడ్డిలు కొన్ని సంవత్సరాలుగా ప్రొక్లైన్ పెట్టుకుని లోడింగ్ చేస్తు న్నారు. అయితే ఎన్డీయే అధికారంలోకి వచ్చిన తర్వాత కొండాపురం మండలంలోని చౌటపల్లె (పోట్లదుర్తి ఆర్ అండ్‌ఆర్ సెంటర్‌లో నివాసం ఉంటున్న)కు చెందిన వెల్లాల రామ్మోహన్‌రెడ్డి కూడా ప్రొక్లైన్ పెట్టి లోడింగ్ చేస్తున్నాడు. అయితే ఇటీవల సంజీవరెడ్డి అల్లుడు నారాయణరెడ్డి, రామ్మోహన్‌రెడ్డి మధ్య లోడింగ్ విషయంలో వాగ్వాదాల జరిగాయి. ఈ నేపధ్యంలో ఆదివారం కూడా ఘర్షణ జరిగినట్లు సమాచారం. అయితే సోమవారం మాట్లాడుకుందాం రా అంటూ సంజీవరెడ్డి ఫోన్‌లో రామ్మోహన్‌రెడ్డిని పిలిచారు. దీంతో సుమారు 50మంది తో వచ్చిన రామ్మోహన్‌రెడ్డి సంజీవరెడ్డిపై కట్టెలతో దాడి చేశారు. అలాగే యాష్‌పాండ్ వద్ద నున్న సంజీవరెడ్డి అల్లుడు మరికొందరిపై దాడి చేసి గాయపరిచారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసు అధికారులు కొండా పురం, ఎర్రగుంట్ల, జమ్మలమడుగు సీఐలు, ఎస్‌ఐలు పోలీసు సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. దాడులకు పాల్పడ్డ వెల్లాల రామ్మోహన్‌రెడ్డి, మరొ కొందరిపై, సంజీవరెడ్డి, విద్యాసాగర్‌రెడ్డి, నారాయణరెడ్డిపై కేసు నమోదు చేసినట్లు సమాచారం. ఈవిషయంపై కొండాపురం సీఐ మహమ్మద్‌రఫీని వివరణ కోరేందుకు ఫోన్‌చేసినా ఎత్తకపోవడం గమనార్హం. ఈవిషయంపై దేవగుడిలో ఇరువర్గాల మధ్య రాజీ చేసినట్లు సమాచారం.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువతి అదృ శ్యంపై కేసు నమోదు చేసిన ట్లు టూటౌన్ సీఐ రామచంద్ర పేర్కొన్నారు. మదనపల్లె పట్టణం నెమలినగర్ సమీపంలోని వడ్డిపల్లెకు చెందిన వెంకటర మణ కుమార్తె నాగలక్ష్మి (23) ఈ నెల 18న ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. బాధితురాలు తండ్రి ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఉరివేసుకుని ట్రాక్టర్ యాజమాని మృతి

మదనపల్లె అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి):ఉరి వేసుకుని ట్రాక్టర్ యాజమని మృతి చెందిన సంఘటన మదనపల్లెలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు మదనపల్లె మండలం, జగన్‌కాలనీ, సరస్వతి నగర్ సమీపంలో నివాసం ఉన్న బోయకొండప్ప కుమారుడు వెంకటరమణ(35) ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తూ ఇటీవల ట్రాక్టర్ ఇంజన్ కొనుగోలు చేసి ట్రాలీ బాడుగకు తీసుకుని వ్యాపారం నిర్వహిస్తున్నారు. అప్పులు ఎక్కువ కావడంతో సోమవారం ఇంటి వద్ద ఓ చెట్టుకు ఉరి వేసుకుని మృతి చెందాడు. గమనించిన కుటుంబసభ్యులు పోలీసులకు సమాచారం అందించారు. వెంటనే శవపరీక్షల కోసం వెంకటరమణ మృతదేహాన్ని మదనపల్లె జిల్లా ప్రభుత్వ ఆస్పత్రిలోని మార్చురీకి తరలించారు. తాలుకా సీఐ కళా వెంకటరమణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. మృతుడికి భార్య అనిత, కుమార్తె, కుమారుడు ఉన్నారు.

ప్రశాంతతలేని నగర్



ప్రశాంత్‌నగర్ మూడో లేన్ ప్రధాన ప్రవేశం

- ప్రశాంత్‌నగర్‌లో ఆకతాయిల బెడద..ట్రాఫిక్ చిక్కులు
- సప్తగిరినగర్.. సమస్యల వలయం
- స్పందించని పాలకులు, అధికారగణం

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా.. ఆంధ్రజ్యోతి ABN

మదనపల్లె, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం 30వ వార్డులోని ప్రశాంత్‌నగర్ కీలకమైన ఏరియా. సమస్యలు కూడా అదే స్థాయిలో ఉంటున్నాయి. ముఖ్యంగా రోడ్లు, కాలువల సమస్య అధికంగా ఉంది. దాంతో పాటు ఇదే వార్డు పరిధిలో ప్రశాంత్‌నగర్‌కు ఆనుకుని ఉన్న సప్తగిరినగర్, ఎ.వి.నాయుడు కాలనీలోనూ దాదాపు ఇలాంటి పరిస్థితులే కనిపిస్తున్నాయి. ఈ వార్డు పరిధిలో ఎక్కువగా విద్యాలయాలు ఉండటంతో ట్రాఫిక్ సమస్య, ఆకతాయిల బెడద స్థానికులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. యువత, ఆకతాయిలు ద్విచక్ర వాహనాల్లో విచ్చలవిడిగా తిరుగుతూ భారీ శబ్దాలు చేయడం వల్ల ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు స్థానికులు వాపోతున్నారు. నాలుగు దశాబ్దాల క్రితం నుంచి అంచెలంచెలుగా అభివృద్ధి చెందుతున్న ఈ ప్రాంతాల్లో దాదాపుగా అప్పుడు నిర్మించిన రోడ్లు, కాలువలే ఎక్కువగా ఉన్నాయి. తర్వాత కాలంలో రోడ్లు, కాలువలు ఆ స్థాయిలో నిర్మించకపోవడంతో ఉన్న రోడ్లు, కాలువలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఈ క్రమంలో రోడ్లు గుంతలు పడిపోవడం, వివిధ అవసరాలకు రోడ్లను విచ్చలవిడిగా తవ్వేయడంతో గోతులు, కాలువలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

ముంచెత్తుతున్న వర్షపునీరు

స్థానిక కదిరి రోడ్డుకు ఆనుకుని ఉన్న ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడు కాలనీ, సప్తగిరినగర్ పైప్రాంతంలోని మార్కెట్‌యార్డు, పాతనీరుగట్టువారిపల్లె, టిప్పుసుల్తాన్ మైదానం నుంచి వచ్చే వర్షపునీరు ఈ మూడు ప్రాంతాలను ముంచెత్తుతుంది. అలాగే ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడుకాలనీ, సప్తగిరినగర్‌లలో కొన్ని రోడ్లు నివాసాలకు లోతుగాను, కొన్ని రోడ్లు ఎక్కువ ఎత్తులో ఉండటంతో వర్షపునీరు లోతుగా ఉన్న ప్రాంతాల్లో చెరువులను తలపిస్తుండగా, ఎత్తుగా ఉన్న ఏరియాలలో ఇళ్లలోకి చేరుతోంది. ఈ సమస్యలను పరిష్కరించాలని స్థానికులు కొన్నేళ్లుగా కోరుతున్నారు. ఈ క్రమంలో ఏడాది క్రితం కదిరి రోడ్డులోని మద్దిమాను నుంచి వీర బ్రహ్మేంద్ర స్వామి ఆలయం వరకు కురవంకలో కలిసేలా పెద్దకాలువనే నిర్మించారు. అలాగే మార్కెట్ యార్డు నుంచి టిప్పుసుల్తాన్ మైదానం మీదుగా మిగిలిన కాలువను కూడా పూర్తి చేసి మద్దిమాను వద్ద కలిపేస్తే సమస్య తీవ్రత తగ్గుతుందని స్థానికులు సూచిస్తున్నారు. వర్షపునీరు ఎక్కువగా సప్తగినగర్‌లో నిలిచి మూడు వీధుల్లోని ఇళ్లలోకి ప్రవేశిస్తోంది.


కాలువలు లేని గుంతలమయం అయిన సప్తగిరినగర్


పైప్రాంతం నుంచి వచ్చిన వర్షపునీటితో జలమయం అయిన సప్తగిరినగర్ (ఫైల్)

అలాగే ఎ.వి.నాయుడు కాలనీ నుంచి ప్రధాన డ్రైనేజీలోకి లింకు లేకపోవడంతో ఎక్కడినీరు అక్కడే ఉండిపోతోంది. మరోవైపు ఇక్కడ నివాసాలకు రెండు వైపులా మురికినీటి కాలువ సరైన క్రమంలో లేకపోవడంతో ఎక్కడినీరు అక్కడే నిలిచిపోతూ దుర్వాసన వస్తోందని స్థానికులు వాపోతున్నారు. అక్కడక్కడా కాలువలు పూడిపోవడంతో నీటి ప్రవాహం ముందుకు సాగడం లేదు. రోడ్లు గుంతలు మయం అయింది. ఇక్కడున్న ఓవర్ హెడ్‌ట్యాంకు స్థానిక ప్రాంతాలకే నీటి సరఫరా చేస్తోంది. ఇక్కడి నుంచి 200 మీటర్లు పైపులైన్ ఏర్పాటు చేస్తే అన్ని ప్రాంతాలకు నీటి సరఫరాకు అవకాశం ఉంది. రూ.2 కోట్ల వ్యయంతో నిర్మించిన ఈ ఓవర్‌హెడ్ ట్యాంకు నిరుపయోగంగా మారగా అక్కడ శానిటేషన్ అధ్వానంగా ఉంది.

అధ్వానంగా రోడ్లు...

సప్తగిరి నగర్‌లోనూ రోడ్లు, కాలువలు అధ్వానంగా ఉన్నాయి. పై ప్రాంతం నుంచి వచ్చే వర్షపునీరు నిల్వ చేరి రోడ్లు గుంతలు పడగా, కాలువలు ఎక్కువగా దెబ్బతిన్నాయి. మరోవైపు డెడ్ ఎండ్ రోడ్లతో..ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి దారి సౌకర్యం లేకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ రోడ్లు కూడా ఆక్రమణకు గురవుతున్నట్లు స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంత్‌గనర్ తరహాలో ఇక్కడా ఇళ్ల ముందు రోడ్లు, కాలువలపై చెట్లు నాటడం, వాహనాలకు పార్కింగ్ ఏర్పాటుతో రోడ్లు కుంచించుకుపోయి ఎదురెదురుగా వాహనం వస్తే ఇబ్బందులు ఏర్పడుతున్నాయి. మరోవైపు ఇదే ప్రాంతంలో ఒకటి, రెండు చోట్ల మురికినీటి కాలువల నిర్మాణానికి అడ్డంకులు ఉన్నట్లు చెబుతున్నారు. ఈ సమస్యలను పరిష్కరించేందుకు ఆంధ్రజ్యోతి చేపట్టిన 'అక్షరం అండగా..పరిష్కారమే అజెండాగా' కార్యక్రమంలో ప్రజలు లేవనెత్తే సమస్యలను పాలకులు, అధికారులు పరిష్కరించాలని స్థానికులు కోరుతున్నారు.


ఎ.వి.నాయుడు కాలనీలో నిరుపయోగంగా ఉన్న ఓవర్‌హెడ్ ట్యాంకు



రోడ్లు, కాలువలే సమస్య

ప్రశాంత్‌నగర్‌లో కాలువలు, రోడ్డే ప్రధాన సమస్యగా ఉన్నాయి. ముఖ్యంగా మురికినీటి కాలువలను అనుసంధానం చేయాలి. పైభాగం నుంచి కింద వరకు డ్రైనేజీ సక్రమంగా వెళ్లేలా చూడాలి. కాలేజీ విద్యార్థులు వీధుల్లో, ఇళ్ల ముందు అక్కడక్కడా నిలబడి స్థానికులకు ఇబ్బందులు కలిగించేలా ప్రవర్తిస్తున్నారు. వీరిని కట్టడి చేయాలి.

-కె.మస్తాన్‌వలి, ప్రశాంత్‌నగర్.



రోడ్లను తవ్వి కాలువలు నిర్మించాలి

ప్రశాంత్‌నగర్‌లో కొన్ని వీధుల్లో ఉన్న రోడ్లను తవ్వేసి వాటిపైనే రోడ్లు వేయాలి. లేకుంటే మరింత ఎత్తుపైకి వచ్చి వర్షపునీరు మరింత ఇళ్లలోకి వెళ్తుంది. గతంలో నిర్మించిన ఇళ్లు చాలా కిందకు ఉండేవి. తర్వాత వేసిన చేపట్టిన నిర్మాణాలతో రోడ్డు..ఇంటి గడప ఎత్తునకు వచ్చాయి. దీంతో వర్షాకాలంలో పై ప్రాంతం నుంచి వర్షపునీరు ప్రశాంత్‌నగర్, సప్తగిరినగర్‌లను ముంచెత్తడంతో సమస్య ఏర్పడుతోంది.

- మార్పూరి మల్లికార్జుననాయుడు, ప్రశాంత్‌నగర్



కళాశాల వేళలే మార్చేశాం

ప్రశాంత్‌నగర్ ఏరియాలో విద్యాసంస్థలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉంది. అన్ని పాఠశాలలు, కళాశాలల ప్రారంభం, ముగింపు వేళలు ఒకటే కావడంతో విపరీతమైన ట్రాఫిక్ సమస్య ఉంది. విద్యార్థులు, తల్లిదండ్రుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని మా కళాశాల టైమింగ్స్‌నే మార్చేశాం. ఇక్కడ పోలీసుల నిఘా కూడా అవసరం. లేకుంటే నిత్యం ఆకతాయిల బెడద, యువత వివాదాలు ఎక్కువగా ఉన్నాయి. ఇక్కడ పోలీసుల పర్యవేక్షణకు మా వంతు సహకరిస్తాం.

-ఇ.వెంకటరెడ్డి, సిద్దార్థ కళాశాలల అధినేత, ప్రశాంత్‌నగర్



స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలి

ఆకతాయిల బైక్ రైడింగ్‌కు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయాలి. పాఠశాలలు, కళాశాలల వద్ద వీరి ఎక్కువ శబ్దాలు చేస్తూ, స్కూటర్లను స్పీడ్ పెంచడంతో శబ్దంతో ఇబ్బందులు, ప్రమాదాలకు కారణం అవుతున్నారు. ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగిస్తున్నారు. ప్రశాంత్‌నగర్, ఎ.వి.నాయుడు కాలనీ, సప్తగిరినగర్‌లను వరద నుంచి కాపాడటానికి మార్కెట్‌యార్డు నుంచి కదిరి రోడ్డు వెంబడి పెద్దకాలువను పూర్తి చేయాలి.

-కె.అమర్‌నాథ్‌రెడ్డి, ప్రశాంత్‌నగర్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యుడు



ఖాళీ స్థలాలతో కష్టాలు

ఇళ్ల మధ్య ఉన్న ఖాళీ స్థలాలతో సమస్యలు వస్తున్నాయి. రాత్రే కాదు..పగలు కూడా పాములు, వర్షాకాలంలో నత్తలు ఎక్కువగా ఇబ్బంది పెడుతున్నాయి. వీటిపై ఎవరికి ఫిర్యాదు చేయాలో అర్థం కావడం లేదు. ఇక ప్రశాంత్‌నగర్ రెండో మెయిన్‌లో అక్కడక్కడా వీధిలైట్లు లేవు. ఉన్నవి సక్రమంగా వెలగడం లేదు.

-సేగు రెడ్డెప్పరెడ్డి, లెక్చరర్, ప్రశాంత్‌నగర్

ప్రకృతి సేద్యం ఆహార ఉత్పత్తులతోనే ఆరోగ్యం


ప్రకృతి సేద్యం కూరగాయలు కొనుగోలు చేస్తున్న ఎంపీడీవో శ్రీధర్‌రావు తదితరులు

పెద్దమండ్యం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) ప్రకృతి సేద్యంతో పండించిన ఆహార ఉత్పత్తులతోనే ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయ జిల్లా అధికారులు లోకేష్, పవన్, వెంకటజ్యోతి పేర్కొన్నారు. పెద్దమండ్యం లోని మండల కార్యాలయాల సముదాయం ప్రాంగణంలో ప్రకృతి సేద్యంతో పండిన ఆహార ఉత్పత్తుల స్టాల్ ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ కూరగాయలు తినడం వల్ల ప్రస్తుతం ప్రజల్లో వేగంగా ప్రబలుతున్న షుగర్, బీపీ వంటి రోగాలు రాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చని తెలిపారు. ప్రతి రైతు ప్రకృతి సేద్యం వైపు అడుగులు వేయాలని వారు పిలుపు నిచ్చారు. తహసీల్దార్ సయ్యద్ ఆహ్మద్, ఎంపీడీవో శ్రీధర్‌రావు, ఏపీఎం నరసింహులు, ప్రకృతి సేద్యం యూనిట్ సభ్యులు వెంకటనారాయణ, సుజాత, మాధవి రైతులు తదితరులు పాల్గొన్నారు.

మానవత సంస్థకు రూ.10 వేల విరాళం

పీలేరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలోని 'మానవత' సంస్థకు రౌద్రాల అంకాళమ్మ ఆలయ చైర్మన్ మాజీ చైర్మన్, దివంగత రిటైర్డు హెచ్ఎం సద్దల కృష్ణయ్య కుటుంబసభ్యులు రూ.10 వేల విరాళం అందజేశారు. సద్దల కృష్ణయ్య 13వ వర్ధంతి సందర్భంగా ఆయన సతీమణి, విశ్రాంత ఉపాధ్యాయిని సద్దల లక్ష్మీదేవి, కుమారుడు భవానీ శేఖర్, కుమార్తెలు రాజేశ్వరి, పుష్పలత విరాళం చెక్కును మానవత సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా మానవత సభ్యులు మాట్లాడుతూ అంకాళమ్మ ఆలయ అభివృద్ధికి సద్దల కృష్ణయ్య కృషి చేశారన్నారు. మానవత సంస్థ సభ్యులు శెట్టి సుబ్రహ్మణ్యం, సురేశ్, కృష్ణమూర్తి, రమేశ్, రహాత్, అక్రం , అశోక్, నాగరాజు పాల్గొన్నారు.

వైసీపీ పాలనకు యువగళంతో చరమగీతం

- టీడీపీ యువనేత నారా లోకేశ్ పాదయాత్ర చరిత్రాత్మకం
- తంబళ్లపల్లె పార్టీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి


కేక్ కట్ చేస్తున్న టీడీపీ ఇన్‌చార్జి జయచంద్రారెడ్డి

ములకలచెరువు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): టీడీపీ యువనేత, మంత్రి నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర అరాచక వైసీపీ పాలన అంతానికి నాంది పలికిందని తంబళ్లపల్లె నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి దాసరిపల్లి జయచంద్రారెడ్డి పేర్కొన్నారు. యువనేత నారా లోకేశ్ యువగళం పాదయాత్ర చేపట్టి నేటికి రెండేళ్ళు పూర్తయిన సందర్భంగా సోమవారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. భారీ ఎత్తున బాణా సంచా పేల్చి కేక్‌ను కట్ చేసి నాయకులు, కార్యకర్తలకు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర ప్రజలకు భరోసానిచ్చిందన్నారు. పాదయాత్ర సమయంలో ప్రజల నుంచి వచ్చిన ఆదరణ చూసి వైసీపీలో వణుకు పుట్టిందన్నారు. వైసీపీ నియంతృత్వాన్ని, నిర్బంధాలను దాటుకుని రాష్ట్రంలో 11 ఉమ్మడి జిల్లాలు, 97 నియోజకవర్గాల్లోని 2097 గ్రామాల మీదుగా 226 రోజుల పాటు 3,132 కిలో మీటర్లు పాదయాత్ర సాగిందన్నారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో నారా లోకేశ్ కురబలకోట, బి.కొత్తకోట, పెద్దతిప్ప సముద్రం, ములకలచెరువు మండలాల్లో వారం రోజుల పాటు 80 కిలో మీటర్ల వరకు పాదయాత్ర చేశారన్నారు. జగన్‌రెడ్డి నిర్వాకానికి అంధకారంలోకి వెళ్ళిన పారిశ్రామిక రంగానికి నూతన వెలుగులు తీసుకురావడం కోసం సీఎం చంద్రబాబు, మంత్రి నారాలోకేశ్‌లు రేయింబవళ్ళు కష్టపడుతున్నారన్నారు. దావోస్, దక్షిణ కొరియా వంటి దేశాల్లో పర్యటించి అన్ని రంగాలకు కలిపి రూ.11.77 లక్షల కోట్లు పెట్టుబడులు తీసుకొచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ జిల్లా ఇన్‌చార్జి యర్రగుడి సురేష్, మార్కెట్ కమిటీ మాజీ వైస్ ఛైర్మన్ కేవీ రమణ, కురబలకోట మండల అధ్యక్షుడు వైజీ సురేంద్రయాదవ్, తెలుగు యువత అధ్యక్షుడు శ్రీనాథ రెడ్డి, నాయకులు రమణమూర్తి, రెడ్డెప్ప, ఫజులు, నీలకంఠారెడ్డి, శంకర్‌రెడ్డి, నాగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్న్‌షిప్‌కు మిట్స్ విద్యార్థుల ఎంపిక

కురబలకోట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని అంగళ్లు సమీపంలోని మిట్స్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన విద్యార్థులు జపాన్‌లోని ఐజు యూనివర్సిటీ ఇంటర్న్ షిప్‌కు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ సి.యువరాజ్ పేర్కొన్నారు. కళాశాలలో ఫైనలియర్‌కు పల్లవి, మానస, ఆయేషా, సాయిగణేశ్వరి, బిందుశ్రీ, ఇందుఈశ్వర్ శివాని, జస్వంత్‌లు 2నెలల పాటు స్ట్రాటజీ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రొగ్రామ్స్, సెంటర్ ఫర్ ప్లానింగ్ అండ్ ప్రమోషన్ తదితర వాటికి సంబంధించి సీనియర్ అసోషియేట్ ప్రొఫెసర్ టూల్స్‌కి కవాగుచి, ప్రొఫెసర్ ఉదయ్‌కిరణ్‌రాగే ఆధ్వర్యంలో పరిశోధనలు చేస్తారన్నారు. కాగా విద్యార్థులు అత్యాధునిక సాంకేతికతను మెరుగుపరచుకోవాలన్నారు. ప్రతిభ కనబరచిన విద్యార్థులను కరెస్పాండెంట్ ఎన్.విజయభాస్కర్ చౌదరి, ఎగ్జిక్యూటీవ్ డైరెక్టర్ కీర్తి నాదెళ్ళ, ప్రిన్సిపాల్ సి.యువరాజ్, డీన్ శ్రీమంత్‌బసు, విజయలక్ష్మి తదితరులు అభినందించారు.

యువతి అదృశ్యంపై కేసు నమోదు

మదనపల్లె అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర పేర్కొన్నారు. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం నెమలినగర్ సమీపంలోని వడ్డిపల్లెకు చెందిన వెంకటరమణ కుమార్తె నాగలక్ష్మి (23) ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న ప్రైవేట్ ఆస్పత్రిలో నర్సుగా పని చేస్తుంది. ఈ నెల 18న ఆస్పత్రి డ్యూటీకని చెప్పి ఇంటినుంచి వెళ్లి తిరిగి రాలేదు. బాధితురాలు తండ్రి ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

కురబలకోటలో పింఛన్లు తనిఖీ

కురబలకోట, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని కురబలకోట, ముదివేడు పంచాయతీల పరిధిలో దివ్యాంగ పింఛన్‌ల తనిఖీ సోమవారం ప్రారంభించినట్లు ఎంపీడీవో గంగయ్య పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలో రూ.15వేలు తీసుకుని పింఛన్‌దారులు 103మంది ఉన్నారని వారికి సంబంధించి పింఛన్లను నేరుగా వారి వారి ఇంటికి వెళ్లి తనిఖీ చేశారు. కాగా ఈ నెల28న తెట్టు, అంగళ్ళు, 29న ఎర్రబల్లి, కనసానివారిపల్లె, చింతమాకులపల్లె, నందిరెడ్డిగారిపల్లె, 30న మట్లివారిపల్లె, దాదాంవారిపల్లె, పిచ్చలవాండ్లపల్లె పంచాయతీలలో తనిఖీలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

'వేల డప్పులు-లక్షల గొంతులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

పీలేరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): హైదరాబాదులో మందకృష్ణ మాదిగ ఆధ్వర్యంలో ఫిబ్రవరి 7వ తేదీన జరుగనున్న 'వేల గొంతులు-లక్షల డప్పులు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు సొట్ట నరేంద్ర బాబు మాదిగ, ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధికార ప్రతినిధి దుడ్డు రామకృష్ణ మాదిగ పిలుపునిచ్చారు. 'వేల గొంతులు-లక్షల డప్పులు' కార్యక్రమ సన్నాహకాల్లో భాగంగా సోమవారం పీలేరులోని టీటీడీ కళ్యాణ మండపంలో ఉమ్మడి చిత్తూరు జిల్లా సమావేశంలో వారిద్దరూ మాట్లాడారు.

ఫుట్‌బాల్ పోటీలు ప్రారంభం

మదనపల్లె అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఖేలో ఇండియా అస్మిత అండర్ 17 గర్ల్స్ ఫుట్‌బాల్ లీగ్ పోటీలను సోమవారం మదనపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎమ్మెల్యే షాజహాన్‌బాషా ప్రారంభించారు. వారం రోజులపాటు ఈ పోటీలు జరుగుతాయని అధ్యక్ష కార్యదర్శులు దిలీప్, మురళీధర్‌లు తెలిపారు. విజేతలకు రూ. 50వేలు, రన్నర్‌కు 30 వేలు బహుమతులు ఉంటాయని క్రీడాభివృద్ధి అధికారి గౌస్‌బాషా తెలిపారు.

పీలేరు ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయండి

- కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు సీపీఐ నేత టీఎల్ వెంకటేశ్ వినతి

రాయచోటి(కలెక్టరేట్), జనవరి27(ఆంధ్రజ్యోతి): పీలేరు పట్టణంలో జరుగుతున్న ఫ్లై ఓవర్ బ్రిడ్జి పనులు సత్వరమే పూర్తి చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు టీఎల్ వెంకటేశ్ కలెక్టర్ చామకూరి శ్రీధర్‌ను కోరారు. ఆమేరకు కలెక్టరేట్‌లో సోమవారం పీజీఆర్‌ఎస్‌లో కలెక్టర్‌ను కలిసి వినతి పత్రం అందజేశారు. పీలేరు ఎల్‌బీఎస్ రోడ్డు మిట్టపై నుంచి క్రాస్ రోడ్డు, చిత్తూరు రోడ్డు వరకు దుమ్ము, ధూళితో అస్తవ్యస్థంగా తయారైందని దీంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గుంతలతో తేలిన రహదారితో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కాంట్రాక్టర్ల నిర్లక్ష్యం వల్ల వాహనాల దుమ్ము, ధూళితో పీలేరు ప్రజలు అనారోగ్యాలపాలవుతున్నారని వాపోయారు. వెంటనే ఫ్లైఓవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయించి ప్రజలకు ఇబ్బంది కలుగకుండా చూడాలని కోరారు. ఈ విషయంపై స్పందించిన కలెక్టర్ చామకూరి శ్రీధర్ సంబంధిత అధికారులతో మాట్లాడి త్వరలో పనులు పూర్తి చేసేలా చూస్తామని హామీ ఇచ్చారని సీపీఐ నేత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ నాయకులు శ్రీనివాసులు, నరసింహులు, జంగన్న తదితరులు పాల్గొన్నారు.

కౌన్సిలర్ దౌర్జన్యాన్ని అడ్డుకోండి..సార్!


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న డీఏవో రాఘవేంద్ర

మదనపల్లె టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మదనపల్లె పట్టణం అమ్మిచెరువుమిట్ట వద్ద తనకు మంజూరైన స్థలాన్ని మున్సిపల్ కౌన్సిలర్ దౌర్జన్యంగా ఆక్రమిస్తున్నాడని, తనకు న్యాయంచేయాలని ఒకటో వార్డుకు చెందిన టి.నరసింహులు సబ్‌కలెక్టరేట్ పీజీఆర్‌ఎస్‌లో ఫిర్యాదు చేశాడు. సోమవారం స్థానిక సబ్ కలెక్టరేట్‌లో డీఏవో రాఘవేంద్ర ఆధ్వర్యంలో పీజీఆర్‌ఎస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా తనకు 2010లో తహసీల్దార్ ఇంటి స్థలం కేటాయిస్తే పునాదులు వేసుకున్నామని, ఇప్పుడు వైసీపీ కౌన్సిలర్ శ్రీనివాసులు, మల్లికార్జున నాయుడు, శంకర్ రెడ్డి, మహదేవ, రమణ, రామకృష్ణారెడ్డి కలసి తాను నిర్మించిన పునాదులు ఆక్రమించుకుంటున్నారని నరసింహులు ఫిర్యాదు చేశాడు. మదనపల్లె మండలం కాశీరావుపేట వద్ద రీసర్వే చేసినా తన భూమికి రెవెన్యూ, అటవీశాఖ అధికారులు హద్దులు చూపించలేదని వి.సుధాకర్‌రెడ్డి ఫిర్యాదు చేశాడు. గతంలో చేసిన రీసర్వే అంతా తప్పుల తడకగా ఉందని, తన భూమిని వేరే వారి పేరిట ఆన్‌లైన్ చేశారని విన్నవించాడు. వీటితో పాటు 38 మంది సమస్యలపై పీజీఆర్‌ఎస్‌లో అర్జీలు అందజేశారు.

స్కౌట్ లీడర్లకు ముగిసిన శిక్షణ

మదనపల్లె అర్బన్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): అన్నమయ్య జిల్లాలో ని క్లబ్ మాస్టర్లకు, ఫ్లాక్ లీడర్లలకు మదనపల్లె పట్టణంలో నిర్వహించిన బేసిక్ శిక్షణా కార్యక్రమం ముగిసిన ట్లు స్కౌట్ జిల్లా సెక్రటరీ మడితాటి నరసింహారెడ్డి తెలిపారు. సోమవా రం శిక్షణ ముగింపు కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ పట్టణంలోని జీఆర్టీ హైస్కూల్‌లో ఈ నెల 21 నుంచి 27 వరకు వారంరోజుల పాటు శిక్షణా కార్యక మం నిర్వహించారన్నారు. ఇందులో క్లబ్ మాస్టర్లు 24 మంది, ఫ్లాక్ లీడర్లు 18 మంది బేసిక్ శిక్షణకు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ చంద్రశే ఖర్, ఏఎల్‌టీ ఉమాపతి, కబ్ మాస్టర్ ఇమాంసాబ్, రమాకృష్ణ, ఫ్లాక్‌లీడర్ సుధారాణి, జ్ఞానోదయ హైస్కూల్ కరస్పాండెంట్ ప్రసాదరావు పాల్గొన్నారు.

ప్రైవేటు కళాశాలల ఫీజు దోపిడీని అరికట్టాలి

మదనపల్లె టౌన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు కళాశాలల ఫీజు దోపిడీని అరికట్టాలని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి అఫ్రీద్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం స్థానిక ప్రైవేటు విద్యాసంస్థల ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అఫ్రీద్ మాట్లాడుతూ కొన్ని కళాశాలలు పేద విద్యార్థులను ఫీజుల పేరుతో పీడించుకుతింటున్నారన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు సమీర్, జయబాబు, విష్ణు, జశ్వంత్, గణేష్, నరేష్ పాల్గొన్నారు.

ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు

మదనపల్లె అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): స్థానిక వన్ డిపో ఆధ్వర్యంలో మదనపల్లె ఆర్టీసీ బస్టాండు, బి.కొత్తకోట మార్గంలో లక్కీ డ్రా తీసి విజేతలైన ప్రయాణికులకు ప్రోత్సాహక బహుమతులు అందించినట్లు వన్ డిపో మేనేజరు మూరే వెంకటరమణారెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విజేతలు సావిత్రమ్మ, స్వర్ణలత, వెంకటరంగారెడ్డిలకు బహుమంతులను అందజేశారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు రేవతి, ఎంఎఫ్ రవి, తదితరులు పాల్గొన్నారు.